ANN తెలుగు
Follow: @ANNTELUGU
04-04-2026
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 97 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




# ఏఐ సునామీని తట్టుకుందాం

## విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

- వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు.. బ్లూ కాలర్ వైపు మొగ్గు చూపాలి
- ప్రభుత్వ బడుల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రయోగాత్మక విద్యా బోధన
- ఇబ్రహీంపట్నంలో పాఠశాల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, మహా:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఒక శక్తిమంతమైన సునామీలా ముంచుకొస్తోందని, ఈ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కోవడానికి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మిగతా 2లో

## టాప్ న్యూస్

### తెలంగాణ నా బ్రెయిన్ చైల్డ్


- నేనెప్పుడూ తెలంగాణకు వ్యతిరేకం కాదు
- ఏపీ సీఎం చంద్రబాబు



02

### నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా...

- యూసీసీ అడ్డుకుంటుంది
- అమిత్ షా



03

### ఢిల్లీలో భూకంపం

- పరుగులు తీసిన జనం



02



# బీఆర్ఎస్ నౌక మునుగుతోంది

## వంద సీట్లతో మళ్లీ మనమే

బావబామ్మర్దుల పోరులో గులాబీ పార్టీ కకావికలం

దేవుడి పేరుతో బీజేపీ డ్రామాలు సాగవు..

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ గడ్డపై బీఆర్ఎస్ పార్టీ తన రాజకీయ అస్తిత్వాన్ని పూర్తిగా కోల్పోయిందని, ఆ పార్టీ పతనం ముగింపు దశకు చేరుకుందని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం మునుపెన్నడూ లేని విధంగా కొనసాగుతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా ప్రజలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంపైనే అచంచలమైన విశ్వాసం ఉంచారని, ఇటీవల జరిగిన పలు ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన సాగుతుంటే ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీలు అపవిత్ర పొత్తులతో విషం చిమ్ముతున్నాయని ఆయన మండిపడ్డారు. గులాబీ దళంలో ప్రస్తుతం నెలకొన్న అంతర్గత ముసలంపై మహేశ్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మిగతా 2లో







# కవిత నోట.. టీఆర్ఎస్

## ఫిబ్రవరిలోనే చెప్పిన మహా

టీఆర్ఎస్ పేరు ఖాళీ.. పింక్ లేని జెండాతో జనంలోకి..

లిక్కర్ కేసు గండం గడిచింది.. ఇక యుద్ధమే మిగిలింది

కవిత సంచలన ప్రకటన

**హైదరాబాద్, మహా:** స్వరాష్ట్ర సాధనలో దశాబ్దాల చరిత్ర కలిగిన 'తెలంగాణ రాష్ట్ర సమితి' (టీఆర్ఎస్) అనే పేరును తన సరికొత్త రాజకీయ ప్రస్థానానికి పెట్టే యోచనలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉన్నారు. మీడియా ప్రతినిధులతో శుక్రవారం జరిగిన ముఖాముఖిలో ఆమె 'టీఆర్ఎస్' అనే బ్రాండ్ నేమ్ ప్రస్తుతం స్వేచ్ఛగా ఉందని, ఆ పేరుతోనే తాను ప్రజల ముందుకు వస్తానని ప్రకటించడం ద్వారా తన తండ్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల కోసం వదిలేసిన పాత పేరును మళ్లీ సొంతం చేసుకునేందుకు ఆమె సిద్ధమయ్యారు. మిగతా 2లో

# రేవంత్ X విజయన్

బుల్డోజర్ పాలన ఆపి.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి

తెలంగాణ సీఎంపై పినరయి విమర్శలు



**మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ సెగలు పుట్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి విమర్శలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తనదైన శైలిలో అత్యంత ఘాటుగా స్పందించారు. కేరళ ఎప్పుడో అభివృద్ధి చెందిందని, వేల మైళ్ల దూరంలో ఉన్న తమ రాష్ట్రం మీద విమర్శలు చేసే ముందు రేవంత్ రెడ్డి తన సొంత రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుంటుందని మిగతా 2లో

# రేవంత్ పోవాలి.. మార్పు రావాలి

నా అడ్డు తొలగించుకునేందుకే పదవుల నియామకంలో జాప్యం

నా భవిష్యత్ ను అభిమానులు, అనుచరులే నిర్ణయిస్తారు

మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**జగిత్యాల, మహా :** అసెంబ్లీకి 2023 లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పోవాలి మార్పు రావాలి అని ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారని, కానీ, నేడు అదే ప్రజలు రెండేళ్ల పాలనలోనే సీఎం రేవంత్ రెడ్డి పోవాలి మార్పు రావాలి' మిగతా 2లో



# ఆపరేషన్ సింధూర్ -2 సంకేతాలు

*కవ్విస్తున్న పాక్.. సరిహద్దుల్లో హై అలర్ట్.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత్ రెడీ*

**ఢిల్లీ, మహా:** ఆపరేషన్ సింధూర్ 2పై గత కొంతకాలంగా బారత ఆర్మీ, రక్షణ అధికారులు అనేకమార్లు ప్రకటనలు చేయగా, ఇపుడు అమెరికా ఇరాన్ యుద్ధం మాటున పాక్ కవ్వింపులు మొదలుపెట్టింది. పాక్ అమెరికాకు తన భూభాగాన్ని ఇస్తే యుద్ధానికి పాక్ ఉబలాట పడే అవకాశముందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని భారత్ రెడీ అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు ఉన్నతస్థాయి భేటీలు జరగ్గా, రాబోయే రెండువారాల్లో ఏమైనా జరగొచ్చని ప్రచారం జరుగుతోంది. ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్ నాథ్ ఇప్పటికే యంత్రాంగానికి సన్నద్ధంగా ఉండాలని సంకేతాలిచ్చారు. ఈసారి పాక్ భారత్ జోలికొస్తే పాక్ ను మ్యాప్ లో లేకుండా చేస్తామని పలుమార్లు భారత రక్షణ అధికారులు హెచ్చరించారు.

**ఏడాది పూర్తవుతున్న తరుణంలో...**

పహల్గామ్ దాడి జరిగి ఏడాది పూర్తవుతున్న తరుణంలో భారత్‌పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ ఉద్రిక్తతలకు ఆజ్యం పోశారు. భారత్ తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తోందని.. నిరంతరం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఒకవేళ భారత్ ఏదైనా దుస్సాహసానికి ఒడిగడితే.. ఊహించని రీతిలో ప్రణాళికాబద్ధమైన మిగతా 2లో



## రేవంత్ సర్కార్ డిజిటల్ ముందడుగు..

80969 58096 నంబర్‌తో సకల సేవలు

వివరాలు 2లో

## ఆపదలో అండగా మిత్రుడు

భారత్‌కు రష్యా భారీ ఇంధన భరోసా

వివరాలు 3లో

# హైదరాబాద్ 'గోల్డ్ మ్యాన్'కు బిగుస్తున్న ఉచ్చు!

## కొత్త ఐటీ చట్టం కింద దేశంలోనే తొలి వారెంట్..

దర్గా చిన్న పహిల్వాన్ ఇంట్లో కోటి విలువైన బంగారం సీజ్!

యూట్యూబ్ వీడియోలే కొంపముంచాయి..

'తెలంగాణ గోల్డ్ మ్యాన్' అక్రమాస్తులపై అధికారుల పంజా!

900 గ్రాముల బంగారం.. 4 లక్షల ఆదాయం..

పొంతన లేని లెక్కలతో ఐటీ విచారణలో దొరికిపోయిన పహిల్వాన్!

**హైదరాబాద్, మహా:** భాగ్యనగరంలో 'బంగారు మనుషుల'పై ఆదాయపు పన్ను శాఖ తన నిఘా నేత్రాన్ని మరింత పదును పెట్టింది. గచ్చిబౌలి ప్రాంతంలో 'తెలంగాణ గోల్డ్ మ్యాన్'గా మిగతా 2లో



# ఏఐ సునామీని తట్టుకుందాం

(మొదటిపేజీ తరువాయి)



వైట్ కాలర్ ఉద్యోగాలకు ఏఐ వల్ల ముప్పు పొంచి ఉన్న తరుణంలో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడకుండా చూడాలంటే బ్లూ కాలర్ ఉద్యోగాలకు అనుగుణమైన వాతావరణాన్ని నిర్మించుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో విద్యావేత్త, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి స్థాపించిన 'ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్' ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా రంగంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సాహసోపేతమైన సంస్కరణలను వివరించారు.ప్రభుత్వాలు విద్యపై భారీగా వెచ్చిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో నాణ్యత ఉండటం లేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడిలో ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ. 1.08 లక్షలు ఖర్చు చేస్తోందని, బడ్జెట్‌లో ఎనిమిది శాతానికి పైగా నిధులు కేటాయిస్తున్నా ఫలితాలు ఆశాజనకంగా లేవని పేర్కొన్నారు. ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి కనీసం మూడో తరగతి పుస్తకాన్ని చదవలేకపోవడం దేశ భవిష్యత్తుకే ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోనూ బడి ఉన్నప్పటికీ నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు ఎక్కడ విఫలమవుతున్నాయో ప్రజాప్రతినిధులు ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు. వ్యవస్థను పటిష్టం చేసే క్రమంలో కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం తప్పనిసరని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని వంద ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విధానాన్ని అమలు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రైవేటు పాఠశాలలు విజయవంతం కావడానికి నర్సరీ, ఎల్ కేజీ వంటి పునాది తరగతులతో పాటు రవాణా సౌకర్యాలు కూడా ప్రధాన కారణమని గుర్తించామని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు రవాణా సౌకర్యాలను కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.
వీటికి తోడు విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో పాఠశాలలను రేషనలైజేషన్ చేసి ప్రయోగాత్మకంగా మోడల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. ఒక్కో పాఠశాలలో 2500 మందికి పైగా విద్యార్థులు చదువుకునేలా అత్యాధునిక వసతులతో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇప్పటికే 59 పాఠశాలల పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ 2034లో భారతదేశంలో నిర్వహించబోయే ఒలింపిక్స్‌లో తెలంగాణ విద్యార్థులు బంగారు పతకాలు సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ప్రకటించారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు డి.కె. అరుణ, వేం నరేందర్ రెడ్డి, రఘునందన్ రావు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నౌక మునుగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీ కవిత పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని, 'వేరు కుంపటి' రాజేయడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందని ఎద్దేవా చేశారు. పార్టీలో క్రమశిక్షణ కరువైందని, ముఖ్యంగా కేటీఆర్, హరీశ్ రావుల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు వల్ల కేడర్ అంతా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోందని విశ్లేషించారు. ఒకప్పుడు అధికారమనే మదంతో విర్రవీగిన నాయకులు ఇప్పుడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటున్నారని దుయ్యబట్టారు. పార్టీ అధినేత కేసీఆర్ రాజకీయాలకు దాదాపు స్వస్తి పలికి కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం ఆ పార్టీ అస్తమయానికి స్పష్టమైన సంకేతమని విమర్శించారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి విశ్రాంతి తీసుకుంటున్న నాయకులను ప్రజలు ఎన్నటికీ క్షమించరని ఆయన హెచ్చరించారు.భారతీయ జనతా పార్టీ తీరును కూడా ఆయన నిశితంగా విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా బీజేపీ నేతలు దేవుడి పేరు చెప్పి, మతపరమైన సెంటిమెంట్లతో ఓట్లు రాబట్టుకోవాలని చూడటం వారికి వెన్నతో పెట్టిన విద్య అని ఆరోపించారు. తెలంగాణ వంటి లౌకిక రాష్ట్రంలో మత రాజకీయాలకు తావు లేదని, అభివృద్ధిని విస్మరించి కేవలం విద్వేషాలను రెచ్చగొట్టడం వల్ల ఆ పార్టీకి భవిష్యత్తు ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావలసిన నిధుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమైన బీజేపీ నేతలు, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్తారని ఆయన ప్రశ్నించారు. దేవుడిని గుడిలో చూడాలి కానీ ఓట్ల పెట్టెలో వెతకడం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువవుతున్నాయని మహేశ్ గౌడ్ వెల్లడించారు. రైతుల రుణమాఫీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వరకు ప్రతి పథకం విజయవంతంగా అమలవుతోందని చెప్పారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలతను చూస్తుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగుండదని ధీమా వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణాన్ని గమనిస్తే, ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయం. విపక్షాల అడ్రస్ గల్లంతు కావడం తథ్యం. రాబోయే ఎన్నికల్లో మాకు వందకు పైగా సీట్లు రావడం నల్లేరు మీద నడకే" అని ఆయన జోస్యం చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడకుండా విపక్షాల అబద్ధాలను తిప్పికొట్టాలని, ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# కవిత నోట.. టీఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

కవిత టీఆర్ఎస్ పేరుతో రాజకీయ పార్టీ పెట్టే అవకాశం ఉందని, తెలంగాణ రాష్ట్రసమితి అని కాకున్నా, టీఆర్ఎస్ అని ప్రజలు పలికేలా తన పార్టీ పేరును నిర్ణయించే అవకాశముందని ఫిబ్రవరి 9నే మహా పత్రిక ప్రచురించింది. ఇపుడు దీనిని నిజం చేస్తూ అదే ఆలోచనలో ఉన్నట్లు కవిత స్పష్టం చేశారు.

### జయశంకర్ సిద్ధాంతాలతోనే..

తన రాజకీయ గురువు ఆచార్య జయశంకర్ సిద్ధాంతాలే ప్రాతిపదికగా తన ప్రస్థానం సాగుతుందని, నేటి రాజకీయాల్లో ఫ్యాషన్‌గా మారిన 'బీహార్' లేదా ఇతర బయటి ప్రాంతాల వ్యూహకర్తల అవసరం తమకు లేదని కవిత తేల్చి చెప్పారు. ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ నిద్రావస్థలో ఉందని, అందుకే తాను అచ్చమైన తెలంగాణ వాదంతో, అమరవీరుల స్తూపం సాక్షిగా, కేవలం ఉద్యమకారులే వేదికపై ఉండేలా తన పార్టీని ఆవిష్కరిస్తానని ఆమె ప్రకటించారు. రాజకీయాల్లో సెంటిమెంట్‌కు మించిన ఆయుధం లేదని నమ్మే ఆమె, 'ఆడబిడ్డకు ఓటు వేయడం' అనే బలమైన భావోద్వేగాన్ని తన ప్రధాన అస్త్రంగా మార్చుకోబోతున్నారు. సిద్దిపేట లేదా గజ్వేల్ వంటి కీలక స్థానాలు మహిళలకు రిజర్వ్ అయితే, అక్కడి నుంచే పోటీచేస్తానని ప్రకటించారు. డీఎస్పీ నాయకుడు విశారదన్ మహారాజ్‌తో కలిసి పనిచేస్తూ, ఆంధ్రాతో సంబంధం లేని అచ్చమైన తెలంగాణ అజెండాతో ముందుకు సాగుతానని కవిత స్పష్టం చేశారు. కవిత టీఆర్ఎస్ జెండా ఎత్తుకుంటే తెలంగాణ రాజకీయాల్లో సంచలనాలు ఖాయం.

# హైదరాబాద్ 'గోల్డ్ మ్యాన్'కు బిగుస్తున్న ఉచ్చు!

## కొత్త ఐటీ చట్టం కింద దేశంలోనే తొలి వారెంట్..



(మొదటిపేజీ తరువాయి)

సుపరిచితుడైన యాదగిరి చిన్న గౌడ్ అలియాస్ దర్గా చిన్న పహిల్వాన్ ఇప్పుడు ఐటీ అధికారుల ఉచ్చులో చిక్కారు. సామాజిక మాధ్యమాల్లో భారీ బంగారు ఆభరణాలతో హంగామా చేస్తూ వార్తల్లో నిలిచే పహిల్వాన్ నివాసంపై దాడులు చేసిన అధికారులు.. సుమారు కోటి రూపాయల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన వద్ద లభించిన మొత్తం 900 గ్రాముల బంగారంలో, 700 గ్రాములకు సంబంధించి ఎటువంటి లెక్కలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. మిగిలిన 200 గ్రాములను వ్యక్తిగత అవసరాల నిమిత్తం మినహాయించి ఆయనకే వదిలేశారు. ఆభరణాల కొనుగోలుకు సంబంధించి ఆదాయ వనరులను వివరించడంలో ఆయన విఫలం కావడంతో అధికారులు ఈ కఠిన చర్య తీసుకున్నారు. ఈ కేసు దేశవ్యాప్తంగా ఒక మైలురాయిగా నిలిచింది. ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన నూతన ఆదాయపు పన్ను చట్టం2025 కింద జారీ అయిన మొట్టమొదటి వారెంట్ ఇదే కావడం గమనార్హం. 1961 నాటి పాత చట్టంలోని సెక్షన్ 132 స్థానంలో వచ్చిన కొత్త చట్టం సెక్షన్ 247 ప్రకారం ఈ తనిఖీలు నిర్వహించారు. పహిల్వాన్ చేస్తున్న హంగామాను అధికారులు గత కొంతకాలంగా 'సోషల్ ప్రొఫైలింగ్' ద్వారా గమనిస్తున్నారు. యూట్యూబ్‌లో ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలు, తన విలాసవంతమైన ఆస్తులను చూపిస్తూ చేసిన 'హోమ్ టూర్' వీడియోలే ఇప్పుడు ఆయన కొంపముంచాయి. గతంలో కొండా విజయ్ కుమార్ వంటి వారిపై కూడా ఇలాంటి దాడులే జరగగా, సూర్య భాయ్ అనే వ్యక్తి ధరించిన నగలు రోల్డ్ గోల్డ్ అని తేలింది. అయితే పహిల్వాన్ ధరించినవి మాత్రం మేలిమి బంగారు ఆభరణాలేనని ఐటీ అధికారులు నిర్ధారించారు. విచారణలో భాగంగా పహిల్వాన్ తన ఆదాయానికి సంబంధించి ఇస్తున్న వివరణలు అధికారులను విస్తుగొలుపుతున్నాయి. ఏటా కేవలం రూ. 4 లక్షల ఆదాయం మాత్రమే ఉన్నట్లు ఐటీ రిటరన్స్‌లో చూపించిన ఆయన.. కోటి రూపాయల విలువైన బంగారం ఎలా వచ్చిందన్న ప్రశ్నకు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ లావాదేవీలు, జీపీఏ సెటిల్‌మెంట్లు, అద్దెల ద్వారా వచ్చే నగదుతోనే ఈ నగలు చేయించుకున్నట్లు ఆయన వాదిస్తున్నారు. భూముల లావాదేవీల్లో నగదు రూపంలో తీసుకున్న కమీషన్లే తన ఆదాయమని ఆయన పేర్కొన్నప్పటికీ, ఆ లావాదేవీలకు ఎటువంటి రికార్డులు లేకపోవడాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. గచ్చిబౌలి పరిసరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా, రాజకీయ నాయకుడిగా చలామణి అవుతున్న చిన్న పహిల్వాన్ అక్రమాస్తుల గుట్టు విప్పేందుకు అధికారులు ఆయన కుటుంబ సభ్యుల ఆర్థిక లావాదేవీలను కూడా జల్లెడ పడుతున్నారు. ఈ ఉదంతం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది.

## రేవంత్ పోవాలి..

# మార్పు రావాలి

### నా అడ్డు తొలగించుకునేందుకే పదవుల నియామకంలో జాప్యం
### నా భవిష్యత్ ను అభిమానులు, అనుచరులే నిర్ణయిస్తారు
### మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)



అనే పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేళ్ల కాలంలోనే రేవంత్ రెడ్డి పై ప్రజలకు తీవ్ర అసంతృప్తి ఏర్పడిందని ఆయన తేల్చి చెప్పారు. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన జీవన్ రెడ్డి ఇటీవలే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాగా ఇంతకాలం పార్టీలో తన అడ్డు తొలగించుకునేందుకే నామినేటెడ్ పదవుల నియామకంలో జాప్యం చేశారని జీవన్ రెడ్డి ఆరోపించారు. వ్యవసాయ రంగానికి ఉపయోగకరమైన కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న విమర్శలు రాజకీయ కోణంలో మాత్రమే ఉన్నాయి .. కానీ పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కాళేశ్వరంపై కేంద్ర మంత్రి సీ.ఆర్. పాటిల్ చేసిన వ్యాఖ్యలను జీవన్ రెడ్డి తప్పు పట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలు మొత్తం ప్రాజెక్ట్‌లో చిన్న భాగమేనని గుర్తు చేశారు. ఈ మూడు బ్యారేజీలను పునరుద్ధరించడానికి కేవలం రూ.500 కోట్లలోపే ఖర్చవుతుందని, అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక వచ్చినప్పటికీ దాన్ని ప్రభుత్వం అమలు చేయలేదని ఆక్షేపించారు. ప్రాణహిత నది జలాలను వినియోగించుకునే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కనీసం సరైన డిజైన్ కూడా రూపొందించలేదని విమర్శించారు. దీనికి సంబంధించి బడ్జెట్‌లో కేవలం రూ. 152 కోట్లు మాత్రమే కేటాయించడం ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కడెం, ఎస్ఆర్ఎస్పీ ద్వారా 100 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టకపోవడం పట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు జీవనాధారమని, హైదరాబాద్ తాగునీరు, పారిశ్రామిక అవసరాలు, మూసి ప్రక్షాళన అన్నీ దీనిపైనే ఆధారపడి ఉన్నాయనే విషయాన్ని విస్మరించరాదన్నారు. మేడిగడ్డ పునరుద్ధరణ పనులు చేపట్టకపోతే దాదాపు 18 లక్షల ఎకరాల సాగు భూమి, హైదరాబాద్ అవసరాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని ఆయన హెచ్చరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణను తక్షణమే చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, లేకపోతే ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తెలంగాణ సమాజం క్షమించదని జీవన్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.

### త్వరలోనే నిర్ణయం

తను ప్రజాసేవ చేసే విషయంలో తప్పకుండా ఏదో ఒక పార్టీలో చేరాల్సిన అవసరం ఉందని, అయితే ఏ పార్టీలో చేరాలనే విషయంలో ఇంకా పూర్తి నిర్ణయం తీసుకోలేదన్నారు. తన రాజకీయ భవిష్యత్తును అభిమానులు, అనుచరులే నిర్ణయిస్తారని తెలిపారు. వారి సూచన, అభ్యర్థన మేరకు తను నిర్ణయం తీసుకుంటానన్నారు. మరో రెండు వారాల్లో తాను ఏ పార్టీలో చేరుతాననేది మీడియా ద్వారానే ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును విమర్శిస్తూ మాట్లాడిన జీవన్ రెడ్డి కేంద్రమంత్రి సీ.ఆర్. పాటిల్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, రేవంత్ రెడ్డిని విమర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.


# తెలంగాణ నా బ్రెయిన్ చైల్డ్

### నేనెపుడూ తెలంగాణకు వ్యతిరేకం కాదు: ఏపీ సీఎం చంద్రబాబు

**అమరావతి, మహా :** తెలంగాణకు నేను ఎప్పుడూ వ్యతిరేకం కాదు.. తెలంగాణ కూడా నా బ్రెయిన్ చైల్డ్ అని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అన్నారు. విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసి విభజన చేయాలని కోరామని, రాజధాని లేకుండా ఏపీని విభజించారన్నారు. తెలుగుజాతి కోసం సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మించామన్నారు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే తాను ప్రమాణం చేస్తానని చెప్పానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదించినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. పుష్కరకాలం కింద అమరావతిని రాజధానిగా నిర్ణయించామని, అది ఇప్పుడు చట్టబద్ధత పొందిందని సీఎం పేర్కొన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 'చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రజలకి ఒక సందేశాన్ని ఇవ్వడానికి ఈ కార్యక్రమం పెట్టాను. అమరావతిని చట్టం చేసి 12సంవత్సరాలు అయ్యింది. రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఆమోదించడం ప్రజా విజయంగా భావిస్తున్నా. పార్లమెంట్లో 10 పార్టీలు మద్దతు ఇచ్చాయి. మిగిలిన పార్టీలు పరోక్షంగా మద్దతు పలికారు. లోక్ సభలో 41 పార్టీలు ఉన్నాయి. 9 పార్టీలు రాజ్యసభలో ఉన్నాయి. అన్ని కలిపి 50 పార్టీలు. నేరుగా చాలా మంది సహకరించారు. ఒకే ఒక్క పార్టీ వైసీపీ మాత్రం ఈ రాష్ట్రానికి ద్రోహం చేసే ప్రయత్నం చేసింది. 2024 జూన్ 2 నుంచి అమరావతి రాజధానిగా శాశ్వతంగా ఉంటుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా వస్తుంది. ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నా. ప్రధాని అన్ని విధాలుగా సహకరించారు' అని సీఎం చెప్పారు.

### వారు నాశనం చేస్తే.. మేం శాసనం చేశాం

'వైసీపీ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. అమరావతి నాశనం అయినా పర్వాలేదని వైసీపీ నేతలు అనుకున్నారు. కానీ మనం 'శాసనం' చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు. విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. తెలుగు జాతి ప్రయోజనాల కోసం సంపద సృష్టికి ఓ ప్రాంతం తయారుకావాలనే హైదరాబాద్లో సైబరాబాద్ నిర్మాణం చేశాం. రెండు ప్రాంతాలకూ సమన్యాయం చేయాలని ఆ రోజు చెప్పాం. చాలా అంశాలు పరిష్కారం కాకున్నా విభజన జరిగింది. ఆర్థిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే తెలంగాణలో ఉన్న 7 పోలవరం ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. తెలంగాణాకు నష్టం కలగాలని ఎప్పుడూ కోరుకోను. ఇవాళ హైదరాబాద్లో ఇంతటి సంపద కలిగిందంటే సైబరాబాద్ లాంటి నగరాల నిర్మాణమే. చాలా మంది ఎంపీలు గుర్తించి పార్లమెంటులోనూ ఇది ప్రస్తావించారు. ఆ గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోను. రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఒక ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించాం. ఏమీ లేకుండా రాష్ట్రం ఏర్పడిందనటానికి అవే ప్రత్యక్ష ఉదాహరణ. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడగుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమని పేర్కొన్నారు. అయితే వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. అధికార వికేంద్రీకరణ చేస్తూనే మనకంటూ ఓ రాజధాని ఉండాలని మేం సంకల్పం చేశాం. ఆ సంకల్పంలో భాగమే మూడు ప్రాంతాలకు సమాన దూరంలో ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేశాం. రాష్ట్రం మధ్యలో ఉన్న ప్రాంతంగా, కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రాత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశాం' అని సీఎం చెప్పుకొచ్చారు.



# నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా యూసీసీ అడ్డుకుంటుంది: అమిత్ షా

**మహా:** చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ద్వారా అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అసోంలోని గోల్‌పడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్రమోదీ, అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ రోడ్ మ్యాప్ సిద్ధం చేశారని అన్నారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారని కాంగ్రెస్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. చొరబాటుదారులు అక్కడి ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీస్తోందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అసోంలో తమకు మరో ఐదేళ్లు సమయం ఇవ్వాలని కోరారు. రాష్ట్రానికి పూర్తిగా చొరబాటుల నుంచి విముక్తి కలిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అసోంలో యూసీసీని అమలు చేస్తామని అమిత్ షా అన్నారు.

# ఢిల్లీలో భూకంపం

## ... పరుగులు తీసిన జనం

**ఢిల్లీ, మహా:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం నాడు భూమి కంపించింది. ఈ భూప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్, ఫరీదాబాద్‌తో పాటు ఉత్తరప్రదేశ్, హర్యానాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనల ప్రభావం స్పష్టంగా కనిపించింది. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఇళ్లలోని ఫ్యాన్లు, ఇతర వస్తువులు ఊగిపోయాయని స్థానికులు తెలిపారు. ఆఫీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా భవనాలను ఖాళీ చేసి, సమీపంలోని ఖాళీ ప్రదేశాలకు చేరుకున్నారు. చాలామంది తమ అనుభవాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు చెబుతున్నారు. భూకంప కేంద్రం ఎక్కడ ఉంది, రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత ఎంత నమోదైందనే వివరాలను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అత్యవసర సేవల బృందాలను అప్రమత్తం చేసినప్పటికీ, ఎలాంటి సహాయక కాల్స్ అందలేదని తెలిసింది. అటు, జమ్ముకశ్మీర్ ప్రాంతంలోనూ ప్రకంపనలు వచ్చినట్టు తెలుస్తోంది. వీటి తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదైనట్టు సమాచారం.

# రేవంత్ X విజయన్

### బుల్డోజర్ పాలన ఆపి.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి
### తెలంగాణ సీఎంపై పినరయి విమర్శలు

(మొదటిపేజీ తరువాయి)

విజయన్ హితవు పలికారు. తెలంగాణలో పేదల ఇళ్లను బుల్డోజర్లతో కనికరం లేకుండా కూల్చివేస్తూ, ఇక్కడకు వచ్చి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఆయన మండిపడ్డారు. కేరళలో కేవలం 0.55 శాతం మాత్రమే పేదరికం ఉందని, ఇది దేశంలోనే అత్యల్పమని గుర్తు చేస్తూ.. పేదరిక నిర్మూలనలో కేరళను చూసి తెలంగాణ నేర్చుకోవాల్సింది చాలా ఉందని పినరయి విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రచారాల కోసం ఖర్చు చేస్తున్న తీరుపై విజయన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేరళ వంటి రాష్ట్రాల్లో రాజకీయ ప్రకటనల కోసం కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వృధా చేసే బదులు, ఆ నిధులను తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఆయన సూచించారు. "సొంత రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు సకాలంలో ఇవ్వలేని ప్రభుత్వం.. కేరళకు వచ్చి మాకు పాలన గురించి సలహాలు ఇవ్వాల్సిన అవసరం లేదు" అంటూ రేవంత్ రెడ్డి సర్కార్ ఆర్థిక వైఫల్యాలను ఆయన ఎండగట్టారు. తెలంగాణలో పాలన అస్తవ్యస్తంగా ఉందనడానికి ఇదే నిదర్శనమని, ఇక్కడ ప్రగల్భాలు పలికే ముందు అక్కడ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకోవాలని పినరయి విజయన్ సూటిగా విమర్శించారు. తెలంగాణ అధికారులే కేరళ వైపు చూస్తున్నారన్న సత్యాన్ని విజయన్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

2025లో తెలంగాణకు చెందిన ఉన్నతాధికారులు కేరళకు వచ్చి, ఇక్కడి అత్యాధునిక డిజిటల్ ల్యాండ్ రికార్డ్ సిస్టమ్ గురించి అధ్యయనం చేశారని, అద్భుతమైన ఆ వ్యవస్థను తమ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని భావించారని ఆయన వెల్లడించారు. తమ దగ్గర నేర్చుకోవడానికి అధికారులు వస్తుంటే, ముఖ్యమంత్రి మాత్రం అబద్ధాలతో విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. సంక్షేమం అంటే ఏమిటో, మంచి పాలన ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే రేవంత్ రెడ్డి రాజకీయ పర్యటనలు పక్కన పెట్టి కేరళలో క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆయన ఆహ్వానించారు. అబద్ధపు ప్రచారాలతో కేరళ ప్రజలను మభ్యపెట్టలేరని, ఇక్కడి ప్రజలు రాజకీయంగా ఎంతో చైతన్యవంతులని విజయన్ స్పష్టం చేశారు. కేరళ విద్యా, వైద్య రంగాల్లో సాధించిన ప్రగతిని విమర్శించే ముందు రేవంత్ రెడ్డి వాస్తవాలను తెలుసుకోవాలని పినరయి విజయన్ ఘాటైన హెచ్చరిక జారీ చేశారు.

# ఆపరేషన్ సింధూర్ -2 సంకేతాలు

### కవ్విస్తున్న పాక్.. సరిహద్దుల్లో హై అలర్ట్.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు భారత్ రెడీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పహల్గామ్ ఘటన వార్షికోత్సవం వేళ భారత్ వైపు నుంచి ముప్పు పొంచి ఉందని ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. "భారత్ తమపై దాడులు చేసేందుకు సాకులు వెతుకుతోంది. మాపై జరిగే ఏ చిన్న దాడినైనా అత్యంత వేగవంతమైన, వ్యూహాత్మక ప్రతిస్పందనతో తిప్పికొడతాం. మరోసారి మాతో ఘర్షణకు దిగితే భారత్ తీవ్ర పరిణామాలు అనుభవించాల్సి ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా ఇరాన్ యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో.. భారత్ దీనిని అవకాశంగా తీసుకుని తమ సరిహద్దుల్లో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు.

### సరిహద్దుల్లో హై అలర్ట్

పహల్గామ్ దాడి వార్షికోత్సవం నేపథ్యంలో జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో భారత భద్రతా దళాలు అత్యంత




అప్రమత్తంగా ఉన్నాయి. అటు ఇరాన్ సంక్షోభం, ఇటు పాక్ మంత్రుల రెచ్చగొట్టే వ్యాఖ్యల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా వర్గాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. పాకిస్థాన్ తన అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆపదలో అండగా 'మిత్రుడు'

## భారత్‌కు రష్యా భారీ ఇంధన భరోసా

- హార్ముజ్ జలసంధి మూసివేత, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల వేళ అండగా ఉంటామని ప్రకటన
- చమురు, గ్యాస్, ఎరువుల సరఫరా పెంచేందుకు సిద్ధం
- ప్రధాని మోదీ, జైశంకర్‌తో రష్యా ఉప ప్రధాని డెనిస్ మాంటిరోవ్ కీలక భేటీ



**ఢిల్లీ, మహా:** మధ్యప్రాచ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాల మధ్య నెలకొన్న యుద్ధ మేఘాలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తున్న తరుణంలో, భారత్‌కు తన చిరకాల మిత్రుడు రష్యా గట్టి భరోసా ఇచ్చింది. అంతర్జాతీయంగా చమురు, సహజవాయువు ధరలు ఆకాశాన్నంటుతున్నా, సరఫరా వ్యవస్థలు అస్తవ్యస్తమవుతున్నా భారత్ మార్కెట్‌కు అవసరమైనంత చమురు, ఎల్పీజీ గ్యాస్‌ను అందించేందుకు రష్యా కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ముఖ్యంగా వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న హార్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాల వల్ల భారత్‌కు ఎదురయ్యే ఇంధన, ఎరువుల కొరతను అధిగమించేందుకు రష్యా అండగా ఉంటుందని ప్రకటించింది. శుక్రవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన రష్యా ఉప ప్రధాని డెనిస్ మాంటిరోవ్.. ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌లతో విడివిడిగా భేటీ అయ్యారు. ఇంధన భద్రత, ఎరువుల సరఫరా, వాణిజ్యం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా ఈ సమావేశంలో లోతైన చర్చలు జరిపారు. గత డిసెంబర్‌లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా కుదిరిన చారిత్రాత్మక ఒప్పందాలను, శిఖరాగ్ర సమావేశ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేసేందుకు ఇరు దేశాలు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మాంటిరోవ్‌తో భేటీ అనంతరం విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ.. కేవలం ఇంధన రంగమే కాకుండా పరిశ్రమలు, కనెక్టివిటీ, మొబిలిటీ మరియు వ్యవసాయ రంగాల్లో రష్యాతో భారత్ బంధం కొత్త పుంతలు తొక్కుతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నా, భారత్ అవసరాలను తీర్చడమే తమ ప్రాధాన్యత అని రష్యా ఉప ప్రధాని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. అమెరికా గతంలో రష్యా చమురుపై విధించిన ఆంక్షలను ఇటీవల ఎత్తివేసిన తర్వాత, భారత్‌కు అతిపెద్ద ఇంధన సరఫరాదారుగా రష్యా తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచే ఎరువుల విషయంలోనూ రష్యా భారత్‌కు పెద్దపీట వేస్తోంది. 2025 చివరి నాటికి భారత్‌కు ఖనిజ ఎరువుల సరఫరాను రష్యా ఏకంగా 40 శాతం పెంచిందని, భవిష్యత్తులో ఈ కోటాను మరింత పెంచేందుకు తమ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని మాంటిరోవ్ వెల్లడించారు. ముఖ్యంగా సామాన్య రైతులకు ఎంతో మేలు చేసే కార్బమైడ్ (యూరియా) ఉత్పత్తి కోసం ఇరు దేశాలు కలిసి ఒక ఉమ్మడి ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశీయంగా ఎరువుల ధరలు పెరగకుండా, కొరత రాకుండా రష్యా అందిస్తున్న ఈ సహకారం భారత్ ఆహార భద్రతకు ఎంతో కీలకం కానుంది. అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం ముంచుకొస్తున్న వేళ, రష్యా నుంచి అందుతున్న ఈ భారీ భరోసా భారత ఆర్థిక వ్యవస్థకు ఊరటనిచ్చే అంశం.

# స్మశానవాటికనా మత్తుబాబులకు అడ్డా నా..!

- కంపచెట్లతో అడవిని తలపిస్తున్న ప్రాంగణం..
- తాగుబోతులకు, గంజాయి బ్యాచ్ లకు నిలయం..
- భయం గుప్పిట్లో స్థానికులు, కాలని వసూలు..
- పట్టించుకోని నల్గొండ కార్పొరేషన్ అధికారులు..



**నల్గొండ :** అంతిమ యాత్రకు వెళ్లే వేళ.. ఆత్మీయులకు వీడ్కోలు పలికే చోట కనీస గౌరవం కరువైంది. నల్గొండ పురపాలక సంఘం 19వ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ స్మశానవాటిక నేడు అధ్వాన స్థితికి చేరింది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో వైకుంఠధామం కాస్తా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. స్మశానవాటిక అంతటా పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలు విపరీతంగా పెరిగిపోయాయి. చూస్తుంటే ఇది స్మశానమా లేక దట్టమైన అడవి అన్న అనుమానం కలగక మానదు. ఈ కంపచెట్ల పొదల మధ్య పాములు, తేళ్లు వంటివి సంచరిస్తుండటంతో స్థానికులు అడుగు పెట్టాలంటేనే వణికిపోతున్నారు. పందుల స్వైర విహారం మరో ఎత్తు అంత్యక్రియల కోసం వచ్చే ప్రజలు ఈ కంపచెట్ల మధ్య నడవలేక నరకయాతన అనుభవిస్తున్నారు.

**గంజాయి, మత్తు బాబులకు నిలయం..**

ఈ వైకుంఠ దామానికి సమీపంలోనే రైల్వే స్టేషన్ ఉండటం అసాంఘిక శక్తులకు వరంగా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కొందరు యువకులు ఇక్కడ గంజాయి సేవిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. చీకటి పడితే ఈ ప్రాంతం మత్తుబాబుల గుప్పిట్లోకి వెళ్తోంది. ఈ అరాచకాలపై ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని ఇక్కడి పరిస్థితి చూసి అటువైపు వెళ్లడానికే భయపడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిరుపయోగంగా మౌలిక వసతులు..**

లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన మౌలిక వసతులు నేడు వృథాగా మారాయి. టాయిలెట్లు, బాత్రూమ్‌లు పూర్తిగా ముళ్లపొదలతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. తలుపులు విరిగిపోయి అపరిశుభ్రతతో నిండి ఉండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో కనీసం లైట్లు కూడా వెలగకపోవడంతో చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక పనులు పెచ్చుమీరుతున్నాయని చనిపోయిన వారికి ప్రశాంతంగా వీడ్కోలు పలికే పరిస్థితి కూడా ఇక్కడ లేదు. ముళ్ల కంపల మధ్య అంత్యక్రియలు చేయడం ప్రాణసంకటంగా మారింది. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పిచ్చిమొక్కలను తొలగించాలి. నిరంతరం నిఘా ఏర్పాటు చేసి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కార్పొరేషన్ అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి ఈ శ్మశానవాటికకు మహర్దశ కల్పించాలని భద్రతా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు, శ్రీనగర్ కాలనీ నివాసితులు కోరుతున్నారు.

## భద్రాచలంలో ఈవో దామోదర్ రావుకు మీడియా సత్కారం



**భద్రాచలం మహా :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు దేశం నలుమూలల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దేవాలయం ఈవో కే. దామోదర్ రావు ఆధ్వర్యంలో భక్తులకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగింది. ముఖ్యంగా కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసే జర్నలిస్టులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం విశేషం. భద్రాచలం ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన మీడియా ప్రతినిధులకు వసతి సౌకర్యం కల్పించడం, కార్యక్రమం సజావుగా కవర్ చేసుకునే విధంగా సహకారం అందించడం పట్ల ఈవో దామోదర్ రావును అభినందించారు. అలాగే ప్రతి సంవత్సరం జర్నలిస్టులకు అందించే తలంబ్రాలను ఈసారి కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సేవలకు గుర్తింపుగా భద్రాచలం ఎలక్ట్రానిక్ మీడియా తరపున ఈవో దామోదర్ రావును చిన్నపాటి సత్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు

# మణుగూరులో తాగునీటి ఎద్దడి..

- గోదావరిలో తగ్గిన నీటిమట్టం..
- ఇంటెక్ వెల్‌కు నిలిచిన నీటి సరఫరా..
- మణుగూరు పట్టణంలో సంక్షోభం..
- తాత్కాలికంగా ప్రత్యేక మోటర్ల ఏర్పాటు




**మణుగూరు, మహా :** గోదావరి నదిలో నీటిమట్టం తగ్గిపోవడంతో మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని చిన్న రావిగూడెం గ్రామ సరిహద్దు గోదావరి నదిలో ఉన్న ఇంటెక్ వెల్‌కు నీటి సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలోని పలు ప్రాంతాలకు తాగునీటి పంపిణీలో అంతరాయం ఏర్పడింది. ప్రత్యేకంగా అశోక్ నగర్, సమితి సింగారం, విటల్ రావు నగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి తలెత్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. వేసవికాలం ప్రారంభమవుతుండటంతో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు మున్సిపల్ అధికారులు అత్యవసర చర్యలు చేపట్టారు. గోదావరి నదిలో ప్రత్యేక మోటర్లను ఏర్పాటు చేసి, అక్కడి నుంచి నీటిని ఇంటెక్ వెల్‌కు మళ్లించే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ చర్యల ద్వారా తాగునీటి సరఫరాను త్వరలోనే పునరుద్ధరిస్తామని మున్సిపల్ సిబ్బంది, అధికారులు తెలిపారు. ఇక వేసవి కాలంలో ప్రతి సంవత్సరం మణుగూరు పట్టణంలో తాగునీటి కొరత పునరావృతమవుతుండటంపై పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు ప్రణాళికతో నీటి వనరుల సంరక్షణ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలకులు, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# అసంపూర్తి మార్కెట్ నిర్మాణంపై ఆగ్రహం..

### చిరు వ్యాపారుల కష్టాలు కనిపించవా..?



**మణుగూరు, మహా :** మణుగూరు మండలంలో సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంపై మహిళా సంఘాలు, వ్యాపార వర్గాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నిర్మాణ పనులు ప్రారంభమై చాలా కాలం గడిచినా ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో పట్టణంలోని చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ఎండలో వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడంతో వ్యాపారులు ఆర్థికంగా, శారీరకంగా నష్టపోతున్నారని వాపోతున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులను మధ్యలోనే వదిలిపెట్టడం వల్ల ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు దక్కడం లేదని విమర్శిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తి కాకముందే అదే కాంట్రాక్టర్‌కు సైడ్ డ్రైన్లు, సీసీ రోడ్ల వంటి ఇతర పనులు అప్పగించడం అధికారుల వైఖరిపై అనుమానాలు కలిగిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బినామీల ద్వారా మరో కాంట్రాక్ట్ పనులు నిర్వహించడం కూడా మున్సిపాలిటీ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం తగదని పేర్కొన్నారు. ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న మార్కెట్ ప్రాంగణం క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటూ, అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోందని తెలిపారు. సిమెంట్ నిల్వలు, ఇతర అనధికార కార్యకలాపాలకు ఆ ప్రదేశం వేదికవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేణుక అక్షరం మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ మాట్లాడుతూ, వెంటనే మున్సిపాలిటీ అధికారులు స్పందించి మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. పనులు పూర్తి చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌పై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాధనం దుర్వినియోగం జరుగుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోకపోతే మున్సిపాలిటీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళా సంఘ సభ్యులు, చిరు వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారులన్నీ సీసీ రోడ్లుగా మారుస్తాం

### సర్పంచ్ మందా నాగరాజు




**బూర్గంపహాడ్ మహా:** గ్రామపంచాయతీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ రహదారులన్నీ సీసీ రహదారులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ మందా నాగరాజు తెలిపారు. గౌతంపురం ఎస్సీ కాలనీలో రూ. 8.5 లక్షల వ్యయంతో వి.బి.జి-రామ్‌జి నిధుల ద్వారా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మార్గదర్శకత్వంలో పంచాయతీలో ఎక్కడా మట్టి రోడ్లు కనిపించకుండా పూర్తిగా సీసీ రహదారులుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. అలాగే గ్రామంలో పక్కా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని, గ్రామాన్ని శుభ్రంగా, సౌకర్యవంతంగా మార్చడం తమ లక్ష్యమని చెప్పారు.

# ప్రమాదం తర్వాతే స్పందన..!

- సింగరేణి ఓబి కంపెనీల్లో డిడిఎంఎస్ తనిఖీలు..
- ఫిట్నెస్ లేని స్కానియా డంపర్ల నిలిపివేత..
- గోప్యంగా నిర్వహించిన తనిఖీలపై విమర్శలు..
- ఆలస్యంగా వెలుగులోకి వివరాలు..




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకే ఓసి 2 గనిలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ (డిడిఎంఎస్) అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ తనిఖీల వివరాలు శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. వీపీఆర్ నుంచి సబ్ కాంట్రాక్ట్ పొంది ఆఫ్‌లోడింగ్ ఓబి పనులు నిర్వహిస్తున్న దుర్గా ఓబీ కంపెనీలో ఈ తనిఖీలు జరిగాయి. తనిఖీల సమయంలో ఫిట్నెస్ సర్టిఫికేట్లు లేకుండా నడుస్తున్న సుమారు వందకు పైగా స్కానియా డంపర్లను అధికారులు నిలిపివేసినట్లు సమాచారం. మొత్తం వాహనాల్లో కేవలం 35 భారీ డంపర్లకే ఫిట్నెస్ అనుమతులు ఉన్నట్లు గుర్తించినట్లు కార్మికులు వెల్లడించారు. ఫిట్నెస్ లేని వాహనాలను పూర్తిగా పార్కింగ్ యార్డ్‌కే పరిమితం చేస్తూ పనులు నిలిపివేయడం జరిగిందని తెలుస్తోంది. ఇటీవల మార్చి 29న డంపర్ టైర్ మరమ్మత్తుల సమయంలో పేలుడు సంభవించి ఓ కార్మికుడు మృతి చెందగా, నలుగురు గాయపడిన ఘటన తెలిసిందే. ఈ ఘటన తర్వాతే ఈ తనిఖీలు చేపట్టడం గమనార్హం. అయితే తనిఖీలను గోప్యంగా నిర్వహించడం, వివరాలు ఆలస్యంగా బయటకు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాల్సిన యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా డిడిఎంఎస్ అధికారులు ఓబి యాజమాన్యానికి పలు కీలక సూచనలు జారీ చేసినట్లు తెలిసింది. వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు, హాల్ రోడ్లు, లైటింగ్, వాటర్ స్ప్రేయింగ్ వంటి అంశాల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అలాగే కోల్ మైన్స్ రెగ్యులేషన్స్ (సిఎంఆర్2017) ప్రకారం సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్ఎంపీ), స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) అమలు చేయాలని స్పష్టం చేశారు. సింగరేణి మణుగూరు ఏరియాలోని ఓసి2, ఓసి4, ఇతర ఓపెన్‌కాస్ట్ గనుల్లో కూడా ఫిట్నెస్ లేని వాహనాలతో పనులు కొనసాగుతున్నాయని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. డ్రైవర్ల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నా యాజమాన్యం పట్టించుకోలేదని సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇప్పటికైనా కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి తరచూ వాహనాల తనిఖీలు నిర్వహించాలని, భద్రతా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయమై వివరణ కోరేందుకు మణుగూరు ఏరియా ఎస్ఓ టు జిఎంను సంప్రదించగా, తనిఖీల వివరాలు పీకే ఓసి2 ప్రాజెక్టు ఆఫీసర్ వద్ద లభిస్తాయని తెలిపారు. ప్రాజెక్టు ఆఫీసర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

# చీకటిలోనే వైఎస్సార్ నగర్..

- విద్యుత్ కోసం విలవిలలాడుతున్న కుటుంబాలు
- ఓటు హక్కు ఇచ్చి బాధ్యత మరిచిన ప్రభుత్వం..
- స్తంభాలు నిలబెట్టినా కరెంట్ మాత్రం లేదు..
- సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి :గ్రామస్తులు



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం కూనవరం పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ నగర్ గ్రామం ఇప్పటికీ చీకటిలోనే జీవనం సాగిస్తోంది. అటవీ భూమిలో, సింగరేణి పీవీ కాలనీకి ఆనుకొని గుట్ట దిగువన ఏర్పడిన ఈ చిన్న గ్రామంలో దాదాపు 20 నుంచి 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. కానీ ఇన్నేళ్లు గడిచినా విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం ఓటు హక్కు కల్పించి, గ్రామాన్ని ఎన్నికల ప్రక్రియలో భాగం చేయగా.. మరోవైపు కనీస మౌలిక వసతులు అందించడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామస్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిసి రోడ్లు, ప్రకృతి వనం వంటి పనులు కూడా చేపట్టారు. అయితే, విద్యుత్ సౌకర్యం మాత్రం కేవలం హామీలకే పరిమితమైంది. గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ఏళ్లైనా, కరెంట్ మాత్రం రాకపోవడం విచారకరం. కొందరు కుటుంబాలు సొంతంగా సోలార్ సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నా... మిగతా వారు చీకటిలోనే జీవనం సాగిస్తున్నారు. రాత్రివేళల్లో పిల్లల చదువులు, వృద్ధుల జీవనం తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఇదిలా ఉండగా, సింగరేణి యాజమాన్యం అప్పటివరకు అవసరాల మేరకు అనుమతితో విద్యుత్ సౌకర్యం కల్పించేదన్న సమాచారం ఉంది. కానీ ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన అక్రమ విద్యుత్ వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఆ సౌకర్యాన్ని కూడా పూర్తిగా తొలగించడం గ్రామ ప్రజలకు మరింత కష్టంగా మారింది.

**అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు..**

వైయస్సార్ నగర్ లో ఇన్నాళ్లుగా విద్యుత్ వినియోగం జరుగుతున్నప్పటికీ సింగరేణి అధికారులు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు సింగరేణి అధికారులే అక్రమ కనెక్షన్లకు మార్గం సుగమం చేశారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఒక్కసారిగా చర్యలు తీసుకోవడం విమర్శలకు దారితీస్తోంది.

**అటవీ శాఖ ఒత్తిడి – ప్రజల ఆవేదన..**

వైయస్సార్ నగర్ గ్రామం ఏర్పడినప్పటి నుంచి అటవీ శాఖ వేధింపులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం విద్యుత్ సమస్య మరింత పెరగడంతో జీవనం దుర్భరంగా మారిందని చెబుతున్నారు. ఈ పరిస్థితి గ్రామాన్ని స్వాధీనం చేసుకోవాలన్న అటవీ శాఖ వ్యూహాలకు అనుకూలంగా మారుతుందేమోనన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

**ప్రకృతి వనం కూడా నిర్లక్ష్యం బారినే..**

గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనానికి సరైన నీటి సదుపాయం లేక మొక్కలు ఎండిపోతున్నాయి. విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేయకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినా అది తాత్కాలిక పరిష్కారంగానే మిగిలింది.

**గ్రామ ప్రజల డిమాండ్..**

ప్రజాపాలన సభల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు సింగరేణి యాజమాన్యం తాత్కాలికంగా అయినా విద్యుత్ అందించాలని కోరుతున్నారు.

**తక్షణ చర్యలు అవసరం..**

గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి గ్రామంలోని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ పూర్తి చేసి గ్రామానికి శాశ్వత సరఫరా కల్పించాలి. సోలార్ సిస్టమ్‌లకు ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వాలి. ప్రకృతి వనానికి మోటార్లు ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించాలి. అటవీ శాఖ, రెవెన్యూ, సింగరేణి సంయుక్తంగా సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఓటు వేసే హక్కు ఉన్నా... దీపం వెలిగించే హక్కు లేకుండా జీవిస్తున్న వైఎస్సార్ నగర్ ప్రజల పరిస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. చీకటి నుంచి వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యతను ఇప్పటికైనా పాలకులు గుర్తించాల్సిన అవసరం ఉంది.

## లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**సత్తుపల్లి, మహా:** మండల పరిధిలోని అర్హులైన 56 మంది లబ్ధిదారులకు 56,06,496 రూపాయల విలువ కలిగిన కళ్యాణ లక్ష్మి, 36 మందికి 20,44,000 రూపాయల విలువ కలిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ పేదవాడి కష్టంలో అండగా నిలబడి ఆడపిల్ల పెళ్లికి, అనారోగ్య పరిస్థితులకు ఆర్థికంగా బలాన్ని అందించే రేవంతన్న కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉండడం తెలంగాణ ప్రజలకు భరోసా అని అన్నారు. తెలంగాణ మహిళ ఆత్మాభిమానంతో ఆర్థిక అభివృద్ధి సాధించి స్వశక్తితో ఎదగడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఆఫీసర్, మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, పట్టణ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, దొడ్డ శ్రీను, పలు గ్రామాల సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**నేలకొండపల్లి, మహా:** మండలం లోని వివిధ గ్రామాలలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని పలు చర్చిలలో తెల్లవారు జామున నుంచే ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు కు సంబంధించిన బోధనలు చేశారు. మండల కేంద్రంలో శిలువ యాత్ర ను నిర్వహించారు. క్రీస్తు ను స్మరించుకుంటూ భక్తి పాటలతో మండల కేంద్రంలోని పలు వీధులలో ప్రదర్శన నిర్వహించారు. శిలువను మోసేందుకు భక్తులు పోటీ పడ్డారు. మండలం లోని చెరువుమాధారం లో బహిరంగ శిలువ మార్గం ను నిర్వహించారు. మండలం లో గుడ్ ఫ్రైడ్ ను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు చర్చి ఫాదర్స్, పాస్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

## రామవరంకు నీళ్లు ఇవ్వడంలో సింగరేణి నిర్లక్ష్యం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి యాజమాన్యం రామవరం ప్రజలకు మంచినీళ్లను అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని దీనికి రామవరం ప్రాంతంలో కార్మికుల సంఖ్య తగ్గటమే కారణమా అని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, 17వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రబెల్లి శంకర్ లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సింగరేణి ఫిల్టర్ బెడ్ ను సందర్శించి వారు మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత ప్రాంతంగా ఉన్న రామవరం పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం చూపుతుందని ఆరోపించారు. ఈ ఫిల్టర్ బెడ్ నుండి త్రీ ఇంక్లైన్ కు నీళ్లు అందించకుండా రామవరం ప్రజలకు మాత్రమే మంచినీళ్లు అందించాలని వారు డిమాండ్ చేశారు. రామవరం 30 వేల జనాభాతో విస్తరించి ఉందని, సింగరేణి తలమానుకమైన రామవరం ప్రజలకు మంచినీళ్లు అందించడంలో సింగరేణి యాజమాన్యం వైఫల్యం చెందుతుందని వారు విమర్శించారు. కార్మికుల సంఖ్య లేదని కారణం చూపుతున్నారో, లేక ఇటు వచ్చే నీళ్లను కొత్త ఓపెన్ కాస్ట్ నిర్మాణం అవసరాలకు స్టోరేజ్ చేస్తున్నారో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్రీ ఇంక్లైన్ ప్రాంతానికి రామవరం ప్రాంతానికి కలిపి ఒక ఫిల్టర్ బెడ్ ద్వారా నీళ్లు అందించడం వల్ల రామవరం ప్రాంత ప్రజలకు మంచినీళ్ల కష్టం తప్పటం లేదని అన్నారు. గత సెవెన్ ఇంక్లైన్ నుండి నిర్వాసితులుగా వచ్చిన ఇందిరమ్మ కాలనీ నాగయ్య గడ్డ, నేతాజీ బస్తి లక్ష్మీ, టాకీస్ ఏరియా, నెహ్రూ బస్తి, బర్మా క్యాంప్ తదితర ఏరియాలో ఎప్పుడో చేసిన పైపులైన్ కారణంగా టి జాయింట్ల వద్ద ఇసుక ఇరుక్కుపోయి కూడా మంచినీళ్లు అందటం లేదని తక్షణమే ఆయా టీ జాయింట్ల వద్ద తవ్వకాలు చేపట్టి పైప్లైన్ లో ఇరుక్కుపోయిన చెత్తాచెదాలను తొలగించి రామవరం ప్రాంత ప్రజల మంచినీటి కష్టాలు తీర్చాలని వారు సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. అలాగే స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసుకోవాలని శిథిలమైన ఫిల్టర్ బెడ్డు ఒక భాగాన్ని నిర్మాణం చేసి దాన్ని ఉపయోగంలోకి తేవాలని కోరారు. నీటిపై నాసు లేకుండా చూడాలని, వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంతరం లేకుండా నిరంతరం మంచినీళ్లు అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఫిల్టర్ బెడ్ ను సందర్శించిన వారిలో సిపిఐ నాయకులు గట్టు చంద్రశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# విలక్షణ రాజకీయం పవన్ సొంతం

యువత రాజకీయాల్లోకి రావాలని, పాలితులుగా ఉండకుండా పాలకులుగా వారు ఎదగాలని ప్రతీ ఒక్కరూ ఆకాంక్షిస్తారు. కానీ, ఆచరణలో ఆ దిశగా యూత్‌ను చైతన్య పరిచి రాజకీయ రంగంలో వారు ముందుకు సాగేలా ప్రోత్సహించే వారు కొద్ది మందే. ముఖ్యంగా యువతలో రాజకీయ చైతన్యం నింపుతూ.. తమదైన గమ్యం చేరుకునేలా ప్రోత్సాహం అందించడం కీలకం. ఆ దిశగా వారి అడుగులు పడేలా ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన వంతు ప్రోత్సాహం ఇస్తున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తన జనసేన పార్టీలో యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. సంప్రదాయ రాజకీయ పార్టీలకు ఉండే భావజాలానికి భిన్నంగా తన పార్టీలో జనసైనికులకు తమదైన పంథాలో ప్రయాణం కొనసాగించేలా దిశానిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతున్నది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో పొలిటికల్‌గా జర్నీ చేయాలని యువతీ యువకులు నడుం బిగుస్తున్నారని చెప్పొచ్చు. జనసేన పార్టీలో జనసైనికులుగా తమ రాజకీయాన్ని షురూ చేయాలనే యువత పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నది.

### విలక్షణ శైలి పవన్ సొంతం

అధికార వికేంద్రీకరణ, పర్యావరణ పరిరక్షణ, సుపరిపాలన వంటి అంశాలతో పాటు దేశభక్తి గురించి నినదించే నాయకుడిగా పవన్ కళ్యాణ్ పేరు సంపాదించు కున్నారు. ముఖ్యంగా యువత అభిమానించే లీడర్ గా పవన్ ఎమర్జ్ అయ్యారు. భారతదేశంలోనే కాదు పంచవ్యాప్తంగానూ ఆయన సినీ నటుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. గూగుల్ లో ఆయన గురించి నెటిజన్లు ఎక్కువగా సెర్చ్ చేయడంతో గూగుల్ పాపులర్ పర్సన్‌గా యాక్టర్స్ కేటగిరీలో రికార్డుకెక్కారు. ఇక దేశంలో తెలుగు రాష్ట్రాలలోనే కాదు ఆ మాటకొస్తే.. దక్షిణాదియే కాదు.. యావత్ భారతదేశంలోనూ ఆయనకు పలుకుబడి ఉంది. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లు ఆయన ఒక "ఆంధీ" అంటే 'తుఫాను' లాగా ముందుకెళ్లగలరు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో దేశ రాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టించారు.

### దేశభక్తి లో ఆయనకు ఆయనే సాటి

అంత కలిపి నేను పిడికెడు మట్టే కావచ్చు. కానీ నేను ఒకసారి తలెత్తి చూస్తే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరుంది' అంటూ అశేష అభిమానులను ఉద్దేశించి పవన్ చెప్పే మాటలు యువతనే కాదు ప్రతీ ఒక్కరిలో ఉత్సాహాన్ని , దేశభక్తిని నూరిపోస్తాయి. ముఖ్యంగా యువతను ఉద్దేశించి.. 'కలలు కను' అంటూ గుంటూరు శేషేంద్ర శర్మ, బాలగంగాధర్ తిలక్ కవితలను ఉటంకిస్తూ..భావోద్వేగంతో పవన్చెప్పే మాటల యువతను ఉత్తేజితం చేస్తున్నాయి. ప్రస్తుతం పాలనాపరంగా డిప్యూటీ సీఎంగా సేవలందిస్తూనే.. నటనాపరంగానూ కుదిరినంతలో సినిమాలు చేస్తూ.. ఒకే సమయంలో నటుడిగానూ, నాయకుడిగానూ.. జోడు గుర్రాల మీద స్వారీ చేస్తూ.. ప్రజల్లో ఉన్నారు. జనసేన అధినేతగా ఉన్న పవన్ కల్యాణ్.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అత్యంత ఆత్మీయుడిగా ఉన్నారు. ఆయన భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు మెండుగానే కనిపిస్తున్నాయి. ఆయన తనను తాను తెలుగు రాష్ట్రాలకే పరిమితం చేసుకోకుండా దక్షిణ భారతదేశంతో పాటు ఉత్తర భారతంలోని వివిధ అంశాలపైన మాట్లాడటం చూస్తుంటే.. యువతలో రాజకీయ చైతన్యం కలిగించేలా.. వారికి జనసేనను ఒక రాజకీయ వేదికగా అందించేందుకు గేట్లు తెరిచే ఉంచినట్లు స్పష్టమౌతున్నది. ఇక దక్షిణ భారతాన అయితే ఇప్పటికే పలువురు సినీ నటులు వెండితెరను వదిలి రాజకీయ రణరంగాన సంచలనాలు సృష్టించారు. ఆ కోవకు చెందిన నాయకుడిగా పవన్ కల్యాణ్ నిలిచారు. అయితే, పవన్ తనదైన శైలిలో స్వయం ప్రకాశితుడిగా, పడి లేచిన కెరటంలా రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన భాషలోనే మరో మాటలో చెప్పాలంటే.. 'ఎక్కడ నెగ్గాలో కాదు..ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు గొప్పవాడు' అనే సినీ డైలాగ్‌ను రియల్ లైఫ్‌లోనూ పవన్ ఫాలో అవుతున్నట్లున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని అందులో.. బలమైన భావజాలం, సిద్ధాంతం, దేశం పట్ల ప్రేమతో, దేశభక్తితో కూడిన పార్టీగా ఉన్న జనసేనలోకి యువత పెద్ద ఎత్తున రావాలని.. నవ భారత నిర్మాణానికి అడుగులు పడాలని ఆశిస్తున్నా.

**- లింగబత్తిని కృష్ణ, జర్నలిస్ట్..**



# ఆమ్ ఆద్మీ పార్టీలో రాఘవ్ చద్దా తుఫాన్

భారతదేశ రాజకీయాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు పార్టీకి యువ గళంగా, రాజ్యసభలో పదునైన వాదనలు వినిపించిన 37 ఏళ్ల యువ ఎంపీ రాఘవ్ చద్దాను ఆ పార్టీ రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తప్పించింది. కేవలం పదవి నుంచి తప్పించడమే కాకుండా, సభలో పార్టీ కోటా నుంచి ఆయనకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకూడదని అధికారికంగా రాజ్యసభ సెక్రటేరియట్‌ను కోరడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. రాబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ల జాబితా నుంచి ఆయన పేరును తొలగించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం వెలువడటం, ఆయన స్థానంలో పంజాబ్ ఎంపీ అశోక్ మిట్టల్‌ను నియమించడం ఆప్ అధిష్ఠానానికి, చద్దాకు మధ్య పెరిగిన అగాధాన్ని స్పష్టం చేస్తోంది. ఈ రాజకీయ పరిణామాలపై రాఘవ్ చద్దా నేరుగా విమర్శలు గుప్పించకుండా, తనదైన శైలిలో స్పందించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఎలాంటి వ్యాఖ్యలు లేకుండా కేవలం "దృష్టి తగలకుండా ఉండే (నజర్)" ఇమోజీని పోస్ట్ చేసి, తన పార్లమెంటరీ ప్రసంగాలకు సంబంధించిన ఒక సుదీర్ఘ వీడియోను పంచుకున్నారు.

### సామాన్యుడి గొంతుకగా పార్లమెంట్‌లో చద్దా ప్రస్థానం

"ప్రజా సమస్యలపై, పబ్లిక్ ఇష్యూస్‌పై మాట్లాడటం ఏదైనా నేరమా? నేను ఏమైనా తప్పు చేశానా?" అని చద్దా తన వీడియో సందేశం ద్వారా ప్రశ్నించారు. సాధారణంగా చట్టసభల్లో పెద్దగా ప్రస్తావనకు రాని, కానీ సామాన్యుడి దైనందిన జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసే ఎన్నో అంశాలను ఆయన తన పదవీకాలంలో బలంగా వినిపించారు. ఆయన లేవనెత్తిన ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి

### ప్యాకెట్ జ్యూస్‌ల పేరుతో అబద్ధపు ప్రకటనలు:

భారతదేశ వినియోగదారుల మార్కెట్ 'తప్పుదోవ పట్టించే బ్రాండింగ్' అనే తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటోందని చద్దా సభ దృష్టికి తెచ్చారు. పండ్ల రసాల ప్యాకెట్ల ముందు భాగంలో ఆకర్షణీయమైన పండ్ల బొమ్మలు ముద్రించి, వెనుక భాగంలో కంటికి కనిపించని చిన్న అక్షరాలతో 'ఇది కేవలం మార్కెటింగ్ కోసం మాత్రమే' అని రాయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆరోగ్యకరమైనవి అని భావించి యువత ఈ చక్కెర ద్రావణాలను తాగుతున్నారని, దీనివల్ల మధుమేహం, ఊబకాయం వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్యాకెట్ ముందు భాగంలోనే స్పష్టంగా 'హై ఇన్ షుగర్' (చక్కెర శాతం ఎక్కువ) అని ముద్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### విమాన ప్రయాణాల ఆలస్యానికి పరిహారం:

సమయం ఆదా చేసుకోవడం కోసమే ప్రయాణికులు వేల రూపాయలు వెచ్చించి విమాన ప్రయాణాలు చేస్తారని, కానీ గంటల కొద్దీ విమానాలు ఆలస్యం కావడం వల్ల వారు ముఖ్యమైన ఇంటర్వ్యూలు, మీటింగ్స్ కోల్పోతున్నారని చద్దా సభలో వాదించారు. లగేజీ ఒక కిలో ఎక్కువైనా జరిమానాలు వసూలు చేసే ఎయిర్‌లైన్స్ సంస్థలు, విమానం 2 నుంచి 6 గంటలు ఆలస్యమైనప్పుడు ప్రయాణికులకు ఎందుకు నష్టపరిహారం చెల్లించవని ఆయన లాజిక్ తీశారు. ప్రయాణికులకు పూర్తి రిఫండ్ లేదా ఆర్థిక పరిహారం ఇచ్చేలా కఠిన నిబంధనలు తీసుకురావాలని కోరారు.



### పంచాయతీల్లో 'సర్పంచ్ పతి' సంస్కృతికి చెక్:

73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని చద్దా ఎత్తిచూపారు. మహిళలకు కేటాయించిన స్థానాల్లో రాజకీయ నాయకుల భార్యలు, సోదరీమణులు, కూతుళ్లు పోటీ చేసి గెలిచినా, పెత్తనం మాత్రం వారి భర్తలు 'సర్పంచ్ పతి' లేదా 'పంచాయత్ పతి' పేరుతో చెలాయిస్తున్నారని వాస్తవ పరిస్థితిని వివరించారు. ఈ పరోక్ష పాలనను అరికట్టేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళికలేమిటని ఆయన ప్రశ్నించారు.

### పితృత్వ సెలవులు చట్టబద్ధమైన హక్కు:

ఒక బిడ్డ పుట్టినప్పుడు పిల్లల పెంపకం బాధ్యత పూర్తిగా తల్లిపైనే వేసే పితృస్వామ్య వ్యవస్థను చద్దా ప్రశ్నించారు. డెలివరీ సమయంలో భార్యకు భర్త భౌతిక, మానసిక మద్దతు ఎంతో అవసరమని, తండ్రికి కూడా బాధ్యతలు ఉంటాయని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉన్న 15 రోజుల పితృత్వ సెలవుల సదుపాయాన్ని, 90% మంది పనిచేసే ప్రైవేట్ రంగానికి కూడా విస్తరించాలని కోరారు. స్వీడన్, ఐస్‌లాండ్, జపాన్ దేశాల తరహాలో భారతదేశంలో కూడా పితృత్వ సెలవులను చట్టబద్ధమైన హక్కుగా మార్చాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.

### సామాన్యుడి జేబుకు చిల్లులు పెట్టే కార్పొరేట్ దోపిడీలు:

ఖరీదైన విమానాశ్రయ భోజనం, టోల్ ప్లాజాల వద్ద జరిగే లూటీలు, బ్యాంక్ ఛార్జీల పేరుతో జరుగుతున్న దోపిడీలతో పాటు, జొమాటో/బ్లింకిట్ వంటి గిగ్ వర్కర్ల హక్కుల కోసం ఆయన పోరాడారు. ముఖ్యంగా టెలికాం కంపెనీలు 28 రోజుల మొబైల్ రీఛార్జ్ వాలిడిటీని అమలు చేయడం ద్వారా, వినియోగదారులు 12 నెలలకు బదులుగా 13 సార్లు రీఛార్జ్ చేసుకునేలా చేస్తున్న మోసాన్ని ఆయన బయటపెట్టారు. (ఆయన లేవనెత్తిన ఈ అంశం వల్లే టెలికాం మంత్రిత్వ శాఖ దీనిని 30 రోజులకు మారుస్తూ నిర్ణయం తీసుకోవడం విశేషం). పార్టీకి, చద్దాకు మధ్య ఎక్కడ చెడింది? ఆయన చేసిన ఈ పోరాటాల వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరిగినప్పటికీ, సొంత పార్టీనే ఆయనను ఎందుకు దూరం పెడుతోంది అన్నది ప్రధాన ప్రశ్న. పార్టీ నాయకులు ఇదొక "సాధారణ అంతర్గత ప్రక్రియ" అని చెబుతున్నప్పటికీ, న్యూస్ రూమ్ విశ్లేషణలు మరియు రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం కారణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఆమ్ ఆద్మీ పార్టీకి అత్యంత క్లిష్టమైన సమయం ఎదురైనప్పుడు చద్దా అందుబాటులో లేకపోవడం దీనికి ప్రధాన కారణం. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా వంటి అగ్ర నాయకులు అరెస్ట్ అయినప్పుడు, వారికి బెయిల్ కోసం పార్టీ పోరాడుతున్న సమయంలో రాఘవ్ చద్దా లండన్‌లో ఉండిపోయారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మౌనంగా ఉండటం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం వల్లే ఆప్ అధిష్ఠానం ఆయనపై అసంతృప్తితో ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ క్రమంలోనే 2024 లోక్‌సభ ఎన్నికలు, 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ల జాబితాల నుంచి ఆయనను పక్కనపెట్టారు.

### బీజేపీ విమర్శలు - పెరుగుతున్న అసమ్మతి

చద్దా వ్యవహారంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఆమ్ ఆద్మీ పార్టీ క్రమంగా తన విశ్వసనీయతను కోల్పోతోంది. ఏ తెలివైన, భవిష్యత్తు ఉన్న రాజకీయ నాయకుడు కూడా ఇకపై ఆప్ పార్టీలో కొనసాగడు. గతంలో మహిళా నేత స్వాతి మలివాల్ విషయంలో కూడా ఇదే జరిగింది. రాఘవ్ చద్దా వ్యవహారం ఆ పార్టీలో అంతర్గతంగా పెరుగుతున్న అసమ్మతికి, నియంతృత్వ ధోరణికి అద్దం పడుతోంది" అని బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు.

### ఓడిపోని మౌనం

"నన్ను ఎందుకు మాట్లాడకుండా అడ్డుకోవాలనుకుంటున్నారు? నా మౌనాన్ని నా ఓటమిగా భావించకండి. నేను సమయం వచ్చినప్పుడు ఉప్పెనలా మారే సముద్రాన్ని" అని రాఘవ్ చద్దా ఇచ్చిన ముగింపు సందేశం ఆయన భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు సంకేతంగా నిలుస్తోంది. ఒక మంచి పార్లమెంటేరియన్‌గా సామాన్య ప్రజల పక్షాన నిలబడి విజయవంతమైనప్పటికీ, కఠినమైన పార్టీ రాజకీయాల్లో "విధేయత, కష్టకాలంలో అందుబాటులో ఉండటం" ఎంత కీలకమో ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. చద్దా రాజకీయ ప్రయాణం ముందు ముందు ఎలాంటి మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

**-ప్రొద్దువాక భీమరావు**

# రేవంత్ సర్కార్ డిజిటల్ ముందడుగు

## 80969 58096 నంబర్‌తో సకల సేవలు




తెలంగాణలో ప్రభుత్వ పాలనను సామాన్యుడి ముంగిటకు చేర్చే దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ ఒక విప్లవాత్మక డిజిటల్ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. గతంలో చిన్నపాటి ధ్రువపత్రం కావాలన్నా మీసేవ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి చూడటం, ఇంటర్నెట్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రజలకు నిత్యకృత్యంగా ఉండేది. ఈ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపుతూ, పాలనను అరచేతిలోని సెల్‌ఫోన్‌లోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం సరికొత్త 'వాట్సాప్ చాట్‌బాట్' విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ప్రత్యేకంగా 80969 58096 అనే వాట్సాప్ నంబర్‌ను కేటాయించి, దానిని రాష్ట్ర ప్రభుత్వ సేవలన్నింటికీ 'వన్ స్టాప్ షాప్'గా తీర్చిదిద్దింది. కేవలం ఒక్క సందేశంతోనే ప్రభుత్వ యంత్రాంగం పౌరుల చెంతకు చేరేలా ఈ వ్యవస్థను రూపొందించడం విశేషం.

ప్రజలు తమ మొబైల్ ఫోన్ నుండి ఈ ప్రత్యేక నంబర్‌కు కేవలం 'Hi' అని మెసేజ్ పంపడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. మెసేజ్ పంపిన వెంటనే వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవల మెనూ ప్రత్యక్షమవుతుంది. ప్రస్తుతం మీసేవ పోర్టల్‌లో అత్యంత రద్దీగా ఉండే కులం, ఆదాయం వంటి ధ్రువపత్రాల దరఖాస్తు ప్రక్రియను దీనికి అనుసంధానించారు. దరఖాస్తు చేయడమే కాకుండా, వాటి ప్రస్తుత స్థితిని తెలుసుకోవడం, మున్సిపల్ పన్నులు చెల్లించడం వంటి పనులు కూడా క్షణాల్లో పూర్తవుతున్నాయి. ఇటీవలే పదో తరగతి, ఇంటర్మీడియట్ మరియు ఇతర ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లను కూడా ఈ వాట్సాప్ ద్వారా విజయవంతంగా పంపిణీ చేసి ప్రభుత్వం ఈ విధానం యొక్క ఖచ్చితత్వాన్ని నిరూపించింది. విద్యుత్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలకు సంబంధించిన కీలక సమాచారాన్ని కూడా ప్రజలు ఇకపై ఇంటి నుంచే పొందవచ్చు. గతంలో ప్రతి శాఖకు ఒక ప్రత్యేక వెబ్‌సైట్ ఉండటంతో ఏ సేవ కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక సామాన్య ప్రజలు తీవ్ర గందరగోళానికి గురయ్యేవారు. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం, అన్ని విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఈ ఇంటిగ్రేటెడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనివల్ల పాలనలో వేగం పెరగడమే కాకుండా పారదర్శకత కూడా వెల్లివిరుస్తోంది. భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా అమలు చేస్తున్న మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడం, అర్హతల వివరాలు తెలుసుకోవడం వంటివి కూడా త్వరలోనే ఈ వాట్సాప్ చాట్‌బాట్‌కు అనుసంధానించనున్నారు.

రానున్న రోజుల్లో రేషన్ కార్డులు, పెన్షన్ల వివరాలు మాత్రమే కాకుండా, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే నగదు సమాచారాన్ని కూడా ఎప్పటికప్పుడు వాట్సాప్ అలర్ట్‌ల ద్వారా అందించనున్నారు. అంతేకాదు, రాష్ట్ర స్థాయి ఉద్యోగ నియామక పరీక్షల నోటిఫికేషన్లు, హాల్ టికెట్లు, మరియు ఫలితాలను కూడా ఈ వేదిక ద్వారానే అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ అధికారిక ప్రకటనలు, అత్యవసర హెచ్చరికలు కూడా ఇకపై నేరుగా ప్రజల వాట్సాప్‌కే చేరనున్నాయి. టెక్నాలజీని వాడుకుంటూ సామాన్యుడికి సేవలందించడంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం డిజిటల్ గవర్నెన్స్ లో ఒక నూతన శకాన్ని ఆవిష్కరిస్తోంది.

**- మహా ప్రత్యేకం**



# ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధి

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**ఆదిలాబాద్ మహా:** ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈనెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటన సందర్భంగా, ఆయన, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ఉర్దూ ఆకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ లతో కలిసి బాసరలో ఏర్పాట్లను పరిశీలించారు.ముందుగా బాసరకు చేరుకున్న ప్రభుత్వ సలహాదారు, తదితరులకు కలెక్టర్ అభిలాష అభినవ్ పూల ముక్కలు అందించి స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, ముఖ్యమంత్రి ఆలయంలో పూజలు నిర్వహించే ప్రాంతం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే ప్రాంతాలు పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.అనంతరం ఆలయ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని అన్నారు. బాసర తో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలు అన్ని అభివృద్ధిపరిస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల అరవ తేదీన ముఖ్యమంత్రి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని చెప్పారు. దేశం నలుమూలల నుంచి బాసరకు ఎంతో మంది భక్తులు వస్తారని, ఆ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, దర్శనాలు సౌకర్యవంతంగా పూర్తయ్యేలా తగిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులంతా సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు .ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ పార్టీ


- అమరుల ప్రాణ త్యాగాల పునాదులపై దేశ భవిష్యత్తు
- సీనియర్ కాంగ్రెస్ నేతలకే అధిక ప్రాధాన్యం



**మంచిర్యాల, మహా :** క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని ఏఐసిసి కార్యదర్శి సచిన్ సావద్, టీపీసీసీఐ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లు స్పష్టం చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎంఎన్ఆర్ గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీరితోపాటు ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర గనులు ఉపాధి కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి, మంచిర్యాల ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల డిసిసి అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ క్రింది స్థాయి నుండి పట్టణ స్థాయి కార్యకర్తల కష్టంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కొనిఆడారు. దేశ స్వతంత్రం కొరకు ఆంగ్లేయులతో వీరోచిత పోరాటం చేసిన అమరుల ప్రాణ త్యాగాల పునాదులపై నేడు దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో కులం, మతం, దేశ భక్తిని రెచ్చగొట్టి అధికారంలోకి రావాలని తీవ్రంగా యత్నిస్తున్నారని వివరించారు. 10 సంవత్సరాల బి.ఆర్.ఎస్ పాలనలో ప్రజలు, గ్రామీణ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొని వివిధ కేసులపాలై జైలుకెల్లారని ఆరోపించారు. ఇలా దెబ్బలు తిని జైలుకెళ్లిన కాంగ్రెస్ సైనికుల వల్లనే కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. 60 సంవత్సరాల తెలంగాణ పాలనలో 68 వేల కోట్లు మాత్రమే అప్పులు ఉన్నాయని వెల్లడించారు. బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ 10 సంవత్సరాల అనాలోచిత పాలనలో 8 లక్షల కోట్లు అప్పుల్లో కూరుకుపోయిందని అన్నారు. లక్షల కోట్ల రూపాయలతో ప్రాజెక్టులు భవనాల నిర్మాణంలో వచ్చిన కమిషన్లతో సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గ్రామస్థాయి కార్యకర్తల నుండి జిల్లా స్థాయి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ పార్టీ కూడా అందించలేదనే సత్యాన్ని ప్రజల్లోకి చేరవేయాలని వారు పిలుపునిచ్చారు. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలోనే పదవులు దక్కుతాయని అందుకు నిదర్శనం టీపీసీసీ అధ్యక్షుడిగా నన్ను ఎంపిక చేయడమే అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. 40 సంవత్సరాలు క్రమశిక్షణతో కాంగ్రెస్ పార్టీకి వివిధ రకాల సేవలు చేశానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు కొత్తగా జిల్లాలో ఎన్నికైన డిసిసి పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వందేమాతరం గేయాన్ని ఆలపించి దేశభక్తిని చాటారు. సభ స్థలానికి హెలికాప్టర్లో మంచిర్యాలకు వచ్చిన నేతలకు చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తదితరులు జిల్లా ఇన్చార్జి మంత్రికి సాదరంగా స్వాగతం పలికారు.

## నేడు ఆదిలాబాద్ కు రానున్న టీపీసీసీ అధ్యక్షులు

### శ్రేణులు హాజరు కావాలని కంది శ్రీనివాస రెడ్డి పిలుపు



**ఆదిలాబాద్ మహా:** నేడు శనివారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదిలాబాద్ పట్టణానికి విచ్చేస్తున్నట్టు ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.జిల్లా నూతన కార్యవర్గం , పొలిటికల్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సమావేశం కానున్నట్టు తెలిపారు.మహేష్ కుమార్ గౌడ్ సమావేశాన్ని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 6న సీయం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి ,షకీల్ , శ్రీలేఖ ప్రశాంత్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి పరామర్శ



**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారిని ,అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కలిసి పరామర్శించి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్టీ భోజారెడ్డి మాతృ మూర్తి ఎల్టీ భగీర్థ బాయి నేడు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసి భోజారెడ్డి నివాసాన్ని సందర్శించారు.ఆయన తల్లి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు. అతనితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కంది శ్రీనివాస రెడ్డి వెంట ఆత్మ చైర్మన్ సంతోష్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి , ఎంఏ షకీల్, ప్రశాంత్ తదితరులున్నారు.

### వేములవాడ నుండి కాళేశ్వరం, యాదగిరిగుట్టలకు

# కొత్త బస్సు సర్వీసులు..

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా నేడు ప్రారంభం

**వేములవాడ,మహా:**వేములవాడ రాజన్న క్షేత్రం నుండి రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కాళేశ్వరం మరియు యాదగిరిగుట్టలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం... టీజీఎస్ఆర్టీసీ నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నూతన బస్సులను శనివారం ఉదయం 10:30 గంటలకు వేములవాడ బస్టాండ్ ఆవరణలో ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వేములవాడ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్ మాట్లాడుతూ ..కాళేశ్వరం వెళ్లే బస్సు ప్రతిరోజూ ఉదయం 6:30 గంటలకు వేములవాడలో బయలుదేరి 10:50 గంటలకు చేరుకుంటుందని, తిరిగి ఉదయం 11:20 గంటలకు అక్కడ బయలుదేరి మధ్యాహ్నం 3:35 గంటలకు వేములవాడ చేరుకుంటుందని తెలిపారు.ఈ సర్వీసుకు పెద్దలకు రూ. 230, పిల్లలకు రూ. 120 చార్జీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా యాదగిరిగుట్టకు ప్రతిరోజూ రెండు ట్రిప్పులు నడపనున్నట్లు ఆయన వివరించారు. మొదటి ట్రిప్పు ఉదయం 6:45 గంటలకు, రెండో ట్రిప్పు మధ్యాహ్నం 2:15 గంటలకు వేములవాడ నుండి బయలుదేరుతాయని తెలిపారు. ఈ సర్వీసుకు పెద్దలకు రూ. 200, పిల్లలకు రూ. 120 చార్జీ ఉంటుందని వెల్లడించారు. వేములవాడ, సిరిసిల్ల పట్టణ ప్రాంత ప్రజలతో పాటు,పరిసర గ్రామాల భక్తులు ఈ మెరుగైన రవాణా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.*

# దొడ్డి కొమురయ్య వీరమరణం రమణీయం



### తెలంగాణ చరిత్రలో మైలురాయి వంటిది

**కుషాయిగూడ, మహా :** తెలంగాణ మట్టి పుత్రుడు, వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రాణాలర్పించిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో శుక్రవారం సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటపెల్లి శంకర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు శంకర్ ఆయన త్యాగాలను స్మరించుకుంటూ, కొమురయ్య స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.సిపిఐ స్థానిక కార్యాలయం వద్ద ప్రధాన కూడళ్లలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మహనీయులు ఉత్సాహ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్, పరుశరాము, నర్సింహా గౌడ్, నర్సింహా, సిపిఐ నగర కార్యదర్శులు, నేతలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పల్–నారపల్లి కారిడార్ పేరుపై రాజకీయాలు వద్దు

- ప్రజల భావోద్వేగాలతో ఆటలాడొద్దు
- రాజిరెడ్డి సేవలకు గుర్తింపే ఈ పేరు : ఎమ్మెల్యే బండారి



**కుషాయిగూడ, మహా :** ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి పేరు పెట్టడంపై జరుగుతున్న వివాదం రాజకీయాలకు బలి కాకూడదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇది కేవలం పేరు విషయం కాదని, ప్రజల భావోద్వేగాలతో జరుగుతున్న రాజకీయ ఆటగా అభివర్ణించారు. శుక్రవారం కాప్రా పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజిరెడ్డి సేవలకు గుర్తింపుగా ఆయన పేరును పెట్టడం సముచితమని పేర్కొన్నారు. ఆయన మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా ప్రజల కోసం చేసిన సేవలను గుర్తుచేశారు. నియోజకవర్గంలో రూ. 150 కోట్ల సీఆర్ఎంపీ నిధులతో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మంత్రి సహకారంతో పనులకు అనుమతులు పొందినట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. కారిడార్ పేరును మాజీ ఎమ్మెల్యే వ్యతిరేకించడం తీవ్రంగా ఖండించారు. ప్రజల కోరిక మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఒకరే వ్యతిరేకించడం వెనుక ప్రజాహితం కంటే రాజకీయ లాభాలే ఉన్నాయని విమర్శించారు. అటల్ బిహారీ వాజపేయి పట్ల గౌరవం ఉందని, ఆయన పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు. అభివృద్ధి పనులకు రాజకీయ రంగు వేయవద్దని, ప్రజల కోసం నిధులు సాధించడం తమ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ నేతలు బైరి నవీన్ గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, ఇంద్రయ్య, కృష్ణగౌడ్, కాలనీ నాయకులు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ డాక్టర్ సెల్ చైర్మన్‌గా డా. తేజస్వి నియామకం



**ఖైరతాబాద్, మహా :** టీపీసీసీ డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ విభాగం ఖైరతాబాద్ జోన్ చైర్మన్‌గా డా. తేజస్వి నియమితులయ్యారు. శుక్రవారం గాంధీ భవన్‌లో రాష్ట్ర డాక్టర్ సెల్ చైర్మన్ డా. యం. రాజీవ్ ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా. తేజస్వి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని, తనపై పెట్టిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని ఆమె తెలిపారు.

## వలిగొండలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు

**వలిగొండ, మహా :** వలిగొండ మండల కేంద్రంలో గురువారం తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య రెండు పదుల వయసు నిండకుండానే భూమికోసం భుక్తి కోసం పీడిత ప్రజల కోసం పోరాటాలు చేసి అమరుడైన మహావీరుడు అని తెలిపారు ఆయన జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఆయన ధైర్య సాహసాలు మరియు సమాజం చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో. కంకల కిష్టయ్య సాయిని యాదగిరి రేగు బీరప్ప ఈతప నరసింహ మల్లేష్ రామచందర్ ఎమ్మె లింగస్వామి శ్రీధర్ సత్యనారాయణ నరేష్ సాయి లోకేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆఫ్ఘనిస్థాన్‌లో భారీ భూకంపం..

- ఢిల్లీ, ఉత్తరాది రాష్ట్రాల్లో బలమైన ప్రకంపనలు
- అర్ధరాత్రి ఉలిక్కిపడ్డ ఉత్తర భారతం
- హిందూకుష్‌లో 5.9 తీవ్రతతో భూకంపం
- రోడ్లపైకి చేరిన జనం..ప్రాణ నష్టం లేదని సమాచారం



**న్యూఢిల్లీ, మహా:** ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ పర్వత శ్రేణుల్లో శుక్రవారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.9గా నమోదైనట్లు భూకంప శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ భూకంప కేంద్రం భూ అంతర్భాగంలో హిందూకుష్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన ఈ ప్రకంపనల ప్రభావం పొరుగు దేశమైన భారత్‌పై కూడా పడింది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారత దేశంలోని పలు రాష్ట్రాల్లో భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

**ఉలిక్కిపడ్డ ఉత్తరాది.. రోడ్లపైకి పరుగులు**

భారత కాలమానం ప్రకారం రాత్రి వేళ ఒక్కసారిగా భూమి కంపించడంతో పంజాబ్, హర్యానా, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని పలు నగరాల్లో భూ ప్రకంపనలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని నోయిడా, గురుగ్రామ్‌లతో పాటు చండీగఢ్, లుధియానా, డెహ్రాడూన్ నగరాల్లో భూమి కుదుపులకు లోనైంది. జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్, పూంచ్, ఉధంపూర్ ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు రావడంతో నిద్రపోతున్న ప్రజలు మేల్కొని భయంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. బహుళ అంతస్తుల భవనాల్లో ఉండేవారు అత్యవసర ద్వారాల గుండా కిందకు దిగి ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు.

**ప్రస్తుతానికి తప్పిన ప్రాణాపాయం**

హిందూకుష్ పర్వత ప్రాంతం భౌగోళికంగా అత్యంత సున్నితమైన జోన్‌లో ఉండటం వల్ల తరచూ ఇక్కడ భూకంపాలు సంభవిస్తుంటాయి. అయితే, శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇప్పటివరకు ఎక్కడా ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు అధికారిక నివేదికలు అందలేదు. ఆఫ్ఘనిస్థాన్‌లోని మారుమూల ప్రాంతాల్లో నష్టం ఏ మేరకు జరిగిందనే అంశంపై అక్కడి అధికారులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. భారత్‌లోనూ ప్రకంపనలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు నెమ్మదిగా ఇళ్లకు చేరుకుంటున్నారు. అధికారులు మాత్రం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

### దేశం దుస్థితి చూడటం కంటే

# అంధత్వమే మేలు

### డాక్టర్లకు ఇమ్రాన్ ఖాన్ భావోద్వేగ సమాధానం
### ఆపరేషన్ వద్దు.. చూపు అవసరం లేదు
### పాక్ మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ షాకింగ్ రిప్లై!

**ఢిల్లీ, మహా:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ మరోసారి తన దేశభక్తిని చాటుకుంటూ డాక్టర్లను విస్మయానికి గురిచేశారు. ప్రస్తుతం జైలులో ఉన్న ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న తరుణంలో, కంటి చూపుకు సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పెరిగిపోతున్న ధరల కంటే తన ప్రాణం పెద్దది కాదని ఆయన భావోద్వేగంతో స్పందించారు.

**వైద్యులు మరియు ఇమ్రాన్ ఖాన్ మధ్య జరిగిన సంభాషణ ఇక్కడ ఉంది:**


డాక్టర్: సర్, మీ కుడి కంటి చూపు ఇప్పటికే 85 శాతం తగ్గిపోయింది. ఎడమ కంటిలో కూడా అదే లక్షణాలు కనిపిస్తున్నాయి.

**ఇమ్రాన్ ఖాన్: అవును, ఆ విషయం నాకు తెలుసు.**

డాక్టర్: మనం వెంటనే మీకు సర్జరీ చేయాలి, లేదంటే మీరు రెండు కళ్ల చూపును శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది.

**ఇమ్రాన్ ఖాన్: నా రెండు కళ్ళకూ ఆపరేషన్ చేసి నన్ను పూర్తిగా అంధుడిని చేసేయండి. కావాలంటే నాకు 'ప్యాసివ్ యుథనేసియా' (కారుణ్య మరణం) ఇచ్చేయండి!**

డాక్టర్: ఎందుకు సార్ అలా అంటున్నారు? మీరు మా 1992 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ కదా?



**ఇమ్రాన్ ఖాన్: "ఎందుకంటే.. నా కళ్ళముందే నా దేశం IMFకి బానిసగా మారడాన్ని, పెట్రోల్ మరియు డీజిల్ ధరలు లీటరుకు 520 రూపాయలకు చేరడాన్ని చూడటం నన్ను ప్రతిరోజూ చంపేస్తోంది. అలా రోజూ చచ్చే కంటే, ఒక్కసారిగా కళ్ళు పోగొట్టుకుని చనిపోవడమే మేలు."**

పాకిస్థాన్ ఎదుర్కొంటున్న కటిక దారిద్ర్యం, అప్పుల ఊబి, ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల పట్ల ఇమ్రాన్ ఖాన్ ఎంతటి ఆవేదనతో ఉన్నారో ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. తన దేశం ఆర్థికంగా చితికిపోవడాన్ని చూడలేక, తన ప్రాణాల కంటే దేశ గౌరవమే ముఖ్యం అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

### మందుతో మక్కపెట్టి..

# ప్రాణాలతో చెలగాటం

### ఆసిఫ్‌నగర్‌లో 7 టన్నుల కల్తీ మామిడి పండ్లు సీజ్




**హైదరాబాద్, మహా:** వేసవి కాలం ప్రారంభంలోనే మామిడి పండ్ల సీజన్‌ను సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు వాడి మామిడి పండ్లను కృత్రిమంగా పండిస్తున్న వైనంపై హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీ అసిస్టెన్స్ అండ్ సర్వైలెన్స్ టీమ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. శుక్రవారం ఆసిఫ్‌నగర్ ప్రాంతంలోని ఒక ఫ్రూట్ గోదాంపై ఆకస్మిక దాడులు నిర్వహించిన అధికారులు, భారీ ఎత్తున నిల్వ ఉంచిన కల్తీ మామిడి పండ్లను స్వాధీనం చేసుకున్నారు.నిర్వహణలో ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోకుండా, అతి తక్కువ సమయంలో పండ్లు పచ్చగా పండేలా చేసేందుకు 'ఇథలీన్' వంటి ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో స్పష్టమైంది. బాటాసింగారం పండ్ల మార్కెట్ నుంచి తీసుకొచ్చిన పచ్చి మామిడి కాయలను ఇక్కడ నిల్వ ఉంచి, రసాయనాలతో మక్కపెట్టి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు గుర్తించారు. దాదాపు 350 ట్రేలలో ఉన్న సుమారు 7 టన్నుల మామిడి పండ్లను సీజ్ చేసిన అధికారులు, వీటి విలువ లక్షల్లో ఉంటుందని అంచనా వేస్తున్నారు. కృత్రిమంగా పండించిన పండ్లను తింటే కాలేయం, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించేలా పండ్లను పండించడం చట్టరీత్యా నేరమని, అటువంటి గోదాంల నిర్వాహకులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. వినియోగదారులు కూడా పండ్లను కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అసహజమైన రంగులు లేదా వాసన కలిగిన పండ్ల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. నగరవ్యాప్తంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే వారిని వదిలి పెట్టబోమని అధికారులు స్పష్టం చేశారు.

## పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడు గదిలో విగతజీవిగా...



**కేపీహెచ్‌బీ కాలనీ, మహా.** వివాహబంధంతో ఒక్కటవ్వాల్సిన ఆ జంట జీవితంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. మరికొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడు, పెళ్లి బట్టలు ధరించి ఉరివేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ప్రేమించిన యువతికి పెళ్లి చేసుకుందామని నమ్మబలికి, తీరా సమయం దగ్గర పడేసరికి ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశమైంది.పోలీసులు మరియు బాధితురాలి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా పొట్లూరు మండలం చెర్లోపల్లికి చెందిన వనమల లోకేష్ (29) నగరంలోని గండిమైసమ్మ ప్రాంతంలో ఉన్న ఒక ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న ఒక యువతితో అతడికి రెండేళ్లుగా పరిచయం ఉంది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. శనివారం గుడిలో లేదా ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకుందామని లోకేష్ ఆ యువతికి చెప్పాడు. ఇందుకు సంబంధించి ఇరువురు కలిసి పెళ్లి బట్టలు కూడా కొనుగోలు చేశారు.ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కేపీహెచ్‌బీ పరిధిలోని అడ్డగుట్టలో ఉన్న ఒక ఓయో గదిని లోకేష్ తీసుకున్నాడు. మధ్యాహ్నం సమయంలో తాను పెళ్లి బట్టలు ధరించి సిద్ధంగా ఉన్నానని, తనకు భోజనం తీసుకురావాలని ఆ యువతికి కబురు పంపాడు. లోకేష్ చెప్పినట్లుగానే ఆమె భోజనం తీసుకుని గది వద్దకు వెళ్లి తలుపు తట్టింది. ఎంతసేపటికీ లోపలి నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళన చెందిన యువతి, తన స్నేహితులకు ఫోన్ చేసింది. వారు అక్కడికి చేరుకుని ఓయో సిబ్బంది సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా, లోకేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు.


Scan here.
Step Forward. Get Recognized. Be Celebrated.


# హిందూ-ముస్లిం ప్రేమకథతో 'సైరాభాను'



తెలుగమ్మాయిలకు హీరోయిన్‌గా అవకాశాలు రావట్లేదని ఒకప్పుడు అనేవారు. కానీ రీసెంట్ టైంలో ఈషా రెబ్బా, అనన్య నాగళ్ల, వైష్ణవి చైతన్య తదితరులు అడపాదడపా మూవీస్ చేస్తూనే ఉన్నారు. 'మసూద' చిత్రంలో దెయ్యం పాత్రలో మెప్పించిన ఓ నటికి ఇప్పుడు హీరోయిన్ ఛాన్స్ వచ్చింది. ఆ చిత్రాన్ని శుక్రవారం లాంఛనంగా మొదలుపెట్టారు. గతేడాది చివరలో 'శంబాల' అనే థ్రిల్లర్ మూవీతో చాన్నాళ్ల తర్వాత హిట్ కొట్టిన ఆది సాయికుమార్.. ఇప్పుడు 'సైరాభాను' అనే ఓ రొమాంటిక్ ప్రేమకథా సినిమాలో నటించేందుకు సిద్ధమైపోయాడు. రాజేశ్ దండా నిర్మిస్తున్న ఈ మూవీ తాజాగా ప్రారంభమైంది. హీరో కిరణ్ అబ్బవరం క్లాప్ కొట్టాడు. ఇందులో హీరోయిన్‌గా 'మసూద'లో దెయ్యంగా నటించి ఆకట్టుకున్న బాంధవి శ్రీధర్‌ని తీసుకున్నారు. 'మసూద'లో సహాయ నటిగా ఆకట్టుకుని హిట్ కొట్టినప్పటికీ బాంధవి శ్రీధర్‌కి పెద్దగా అవకాశాలు రాలేదు. దీంతో సోషల్ మీడియాలో గ్లామరస్ ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేస్తూ హల్‌చల్ చేసేది. ఇప్పుడు హీరోయిన్‌గా అంటే పెద్ద ఛాన్సే అనే చెప్పొచ్చు. ఈ సినిమా హిందూముస్లిం బ్యాక్‌డ్రాప్‌లో హైదరాబాద్‌ఆంధ్రా కనెక్షన్‌తో రొమాంటిక్ కామెడీ కాన్సెప్ట్‌తో రాబోతుంది.




# ఆ డైరెక్టర్‌తో నేనైతే చేయను



**కొన్ని సినిమాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. వాటిని రీరిలీజ్ చేసినా, సీక్వెల్ తీసినా చూసేందుకు ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అలా యుగానికి ఒక్కడు (ఆయిరత్తిల్ ఒరువన్) సీక్వెల్ కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కార్తీ హీరోగా, ఆండ్రియా జెర్మియా, రీమా సేన్ హీరోయిన్లుగా నటించారు. ధనుష్ సోదరుడు సెల్వరాఘవన్ దర్శకత్వం వహించాడు. 2010లో విడుదలైన ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని గతంలోనే దర్శకుడు ప్రకటించాడు.**

## ఆషామాషీ కాదు

కానీ ఏళ్లు గడుస్తున్నా ఆ దిశగా పనులు జరగలేదు. గతేడాది చివర్లో మరోసారి సీక్వెల్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు సెల్వ. ధనుష్, కార్తీతో కలిసి సీక్వెల్ తీస్తానని, కాకపోతే ఏడాదిపాటు వారు కాల్‌షీట్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నాడు. ఇప్పటికే చేతిలో సినిమాలతో బిజీగా ఉన్న ఇద్దరు స్టార్ హీరోలు ఏడాదిపాటు డేట్స్ ఇవ్వాలంటే ఆషామాషీ కాదు. అదెప్పుడు సాధ్యమవుతుందో చూడాలి!

## సీక్వెల్‌లో నేనుండను

ఇకపోతే యుగానికి ఒక్కడు సీక్వెల్‌పై నటి, సింగర్ ఆండ్రియా జెర్మియా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. యుగానికి ఒక్కడు సినిమా చేయడం ఒక అద్భుతమైన అనుభవం. ఆ మూవీ నటిగా ఎదిగేందుకు తోడ్పడింది. అయితే రెండో భాగంలో నేను ఉంటానని మాత్రం ఊహించకండి. యుగానికి ఒక్కడు సీక్వెల్ తెరకెక్కితే సంతోషమే కానీ నేను మాత్రం అందులో చేయలేను.

## ఆయనతో పని చేయడం కష్టం

ఎందుకంటే మొదటి భాగమే 200 రోజులు తెరకెక్కించారు. అన్ని రోజులు పని చేయడమంటే మాటలు కాదు. అక్కడ అంత కష్టపడ్డాను గనుకే తర్వాత చేసిన సినిమాలు ఎంతో సులువుగా అనిపించాయి. ఏదేమైనా దర్శకుడు సెల్వరాఘవన్‌తో కలిసి పని చేయడం చాలా కష్టం అని పేర్కొంది. ప్రస్తుతం ఆండ్రియా చేతిలో మనుషి, పిశాచి 2, నో ఎంట్రీ సినిమాలున్నాయి.

# పనిమనిషి లైంగిక వేధింపులు.. చేతులు జోడించి అడిగా.. ఇలా కాదని!

లైంగిక వేధింపుల నుంచి తనను తాను కాపాడుకునేందుకు రెండో అంతస్తు నుంచి దూకానంటోంది బుల్లితెర నటి, హిందీ బిగ్‌బాస్ 13వ కంటెస్టెంట్ ఆర్తి సింగ్. అప్పుడు తన వయసు కేవలం 13 ఏళ్లేనని చెప్తోంది. చిన్న వయసులో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. ఆర్తి సింగ్ మాట్లాడుతూ.. అప్పుడు నాకు 13 ఏళ్లు. మా ఇంట్లో పనిచేసే వ్యక్తి నాపై అఘాయిత్యం చేసేందుకు ప్రయత్నించాడు.

## చేతులు జోడించి బతిమాలినా..

నేను మంచి నిద్రలో ఉండగా నా గదిలోకి నడుచుకుంటూ వచ్చాడు. నా గదిలోకి ఎందుకు వచ్చావని గొడవపడ్డాను. నాపైకి వస్తుంటే నువ్వు నా అన్నయ్యవి కదా, ప్లీజ్ వెళ్లిపో అని రెండు చేతులు జోడించి వేడుకున్నాను. అతడు నా మాట వినలేదు. నేను బయట వరండా వైపు చూస్తే తలుపులు తాళం వేసి ఉన్నాయి. అమ్మ పొలానికి వెళ్లింది, ఇంట్లో ఒంటరిగా ఉన్నాను.

## రెండో ఫ్లోర్ నుంచి దూకేశా..

అక్కడ వాతావరణం భయానకంగా మారింది. బయటకు వెళ్లే పరిస్థితి కనిపించలేదు. నేను వెంటనే అతడి నుంచి తప్పించుకుని రెండో అంతస్తుకు పరిగెత్తి అక్కడి నుంచి కిందకు దూకేశాను. నేను చాలా స్ట్రాంగ్‌గా ఉన్నాను కాబట్టే ఆ రోజు నాపై ఏ అఘాయిత్యం జరగకుండా నన్ను నేను కాపాడుకోగలిగాను అంది. ఆర్తి సింగ్.. గృహస్తి, పరిచయ్, ఉత్తరన్, దేవోన్ కే దేవ్.. మహాదేవ్, వారిస్, విక్రమ్ బేతాళ్‌కీ రహస్య గాథ వంటి పలు హిందీ సీరియల్స్‌లో నటించింది. హిందీ బిగ్‌బాస్ 13వ సీజన్‌లో నాలుగో రన్నరప్‌గా నిలిచింది.



# టాలీవుడ్‌లోకి జాక్వెలిన్ ఫెర్నాండెజ్..

బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఇప్పుడు టాలీవుడ్ వెండితెరపై మెరవడానికి సిద్ధమవుతోంది. ఇప్పటివరకు హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ, ఇప్పుడు ఒక భారీ బడ్జెట్ తెలుగు సినిమాతో సౌత్ ఇండియాలోకి అడుగుపెడుతున్నారు. 'పేపర్ బాయ్', 'అరి' వంటి చిత్రాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ జయశంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కమర్షియల్ హంగులతో పాటు వైవిధ్యమైన కథాంశంతో ఈ సినిమాను ఆయన తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. చిత్రంలోని అత్యంత కీలకమైన సన్నివేశాలను డార్జిలింగ్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్‌తో సినిమాను రూపొందిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్టులో జాక్వెలిన్ సరసన నటించే హీరో ఎవరు? సినిమా టైటిల్ ఏమిటి? అనే విషయాలను చిత్ర యూనిట్ ప్రస్తుతానికి గోప్యంగా ఉంచింది. అయితే, టాలీవుడ్‌కు చెందిన ఒక స్టార్ హీరో ఇందులో నటిస్తున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. త్వరలోనే ఈ చిత్ర టైటిట్‌తో పాటు ఇతర నటీనటుల వివరాలను అధికారికంగా ప్రకటించేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com